# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | గురువారం 10 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 123

తెలుగు దినపత్రిక





## నేడు సద్దుల బతుకమ్మ సంబురాలు

ట్యాంక్‌బండ్‌పై విస్తృత ఏర్పాట్లు..
రాజ్‌భవన్‌లో అంబరాన్నంటిన వేడుకలు..
గవర్నర్ కుటుంబంతో కలిసి పాల్గొన్న మహిళా మంత్రులు, సీఎస్
ఆడపడుచులకు సీతక్క, సురేఖ పండుగ శుభాకాంక్షలు..

4



# రతన్ టాటా..

## ఓ మహా మనిషీ వందనం..

నేలకొరిగిన వ్యాపార దిగ్గజం..
కరోనా వేళ దేశానికి ధారపోసిన మహోన్నత శిఖరం
చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి..
శోకసంద్రమైన యావత్ దేశం..
నివాళి అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని, సీఎం, ఇతర ప్రముఖులు..

5

స్వార్థం చూడని వ్యాపారం., సేవ మరువని ఔన్నత్యం. పైసా కాదు ప్రధానం., సాటి ప్రాణి రక్షణే కీలకమనే సున్నితత్వం. నాణ్యతే పెట్టుబడిగా, ప్రజావసరాలు తీర్చుడే లాభాలుగా భావించి దశాబ్దాలుగా సామ్రాజ్య స్థాయికి మచ్చలేకుండా సాగించిన మహోన్నతం. దేశం కష్టాల్లో ఉన్నదంటే నేనున్నానంటూ ప్రకటించిన ఆ గొప్ప హృదయస్పందన బుధవారం రాత్రితో ఆగిపోయింది. మహోన్నత వ్యక్తి రతన్ టాటా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయి భరత మాతను ఒకరకంగా ఒంటరిని చేశారంటే అతిశయోక్తి కాదేమో. జోహార్ రతన్ జీ..

- జనపదం, బిజినెస్

# పంతుళ్లకే పాఠాలు..?!



- డీఎస్సీ విజేతలకు నియామకపత్రాల అందజేత..
- గత సర్కార్ పై దుమ్మెత్తిపోసిన సీఎం రేవంత్..
- నిరుద్యోగితను తగ్గించేది తామే అని ప్రకటన..
- కౌంటర్ గా హరీష్ రావు ఘాటు వ్యాఖ్యలు..
- లంచగొండి నేత నీతులు చెప్పడం విడ్డూరమని ఎద్దేవా..
- నూతన టీచర్లే కేంద్రంగా ఇరు పార్టీల 'రాజకీయం..'

3

మంచి పనిచేయడం చాలా మంచిది. కానీ, ప్రతి దానికి వైరి వర్గంపైనో., ఇతరులపైనో ముడిపెడుతూ దుమ్మెత్తిపోయడమే వెగటు పుట్టిస్తుంది. దేనికైనా సమయం, సందర్భం.. అనేవి ఉంటాయి., వాటిని అనుసరిస్తూ నడుచుకుంటే హుందాగా ఉంటుంది. అలా కాకుండా గుడ్డెద్దు చేల్లో పడ్డట్టు.., లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా సాగితే పెద్దరికమేమోగానీ, నవ్వుల పాలవడం ఖాయం. బుధవారం నాటి డీఎస్సీ నియామకపత్రాల అందజేత కూడా అలాంటిదే అనొచ్చు. వాళ్లంతా సమాజాన్ని గాడిలో పెట్టబోయే ఉపాధ్యాయులు. పుస్తకాలతో కుస్తీపడుతూ, ఏది మంచి, ఏది చెడు., ఎవరేంటి..., అని అన్నీ చదివిన మేధావులు. ఆ మాటకొస్తే సమాజ శాస్త్రాన్ని అవపోసన పట్టి ఉన్నవారు. వారికే పాఠం అప్పజెప్పాలని చూడడం మరీ విడ్డూరం. సీఎం రేవంత్ గత సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ సంతృప్తి చెందిన తీరును, ఆ తర్వాత వెంటనే మాజీ మంత్రి హరీష్ రావు కడిగేస్తూ ఎండబెట్టారు. రెండు పార్టీల మధ్య వైరం, రెండు ప్రభుత్వాల మధ్య వైరుధ్యం ఏంటో తెలియకుండానే వాళ్లంతా అంత పెద్ద ఉద్యోగాలు సంపాదించారా..? లేదంటే చెప్పింది వింటున్నారుకదా అని ప్రభుత్వ పెద్దలు ఏదేదో వాగేశారా..? ఏదిఏమైనా సర్కార్ చర్యకు ప్రతిపక్షపు ప్రతిచర్య డీఎస్సీ విజేతల సాక్షిగా హైలైట్.



## నియ్యతి లేని నేత నీతి జెప్పవట్టే..

- రేవంత్ పై మాజీ మంత్రి హరీశ్ ఫైర్..
- ఉపాధ్యాయుల సాక్షిగా పచ్చి అబద్ధాలని ఖండన..
- లంచమియ్యబోయి దొరికిన దొంగ అంటూ ఆగ్రహం..
- బీఆర్ఎస్ చేపట్టిన ఉద్యోగ లెక్కలు వివరించిన హరీష్..

జనపదం, హైదరాబాద్ బ్యూరో:

డబ్బు సంచులతో లంచం ఇవ్వబోతూ పట్టబడిన దొంగ ఉపాధ్యాయులకు నీతి వచనాలు చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్టు ఉందని మాజీ మంత్రి హరీష్ రావు ఎద్దేవా చేశారు. డీఎస్సీ విజేతలకు ......(తరువాయి 3లో)

## బీజేపీలో కొత్త జోష్..

- రెండు రాష్ట్రాల రిజల్ట్స్ తో ఊపు..
- ఓటింగ్ పెరగడంపై కమలం ఖుషీ..
- ఒక్క ఫలితం.. లక్షల అనుమానాలు...
- జీర్ణించుకోలేక పోతున్న కాంగ్రెస్..
- హర్యానా, జమ్మూ ఫలితాలతో తెలిసి పోయిన ఓటరు నాడీ..

4

కమలం మరింత వికసిస్తున్నది. పనైపోయిందని పండుగ చేసుకుందామనుకున్న వారి నోళ్లు మూయిస్తూ దగదగ మెరిసే వన్నెను సంతరించుకుంది. ఉత్తర భారతాన రెండు రాష్ట్రాల్లో ఫలితాలు పార్టీకి కొత్త జవసత్వాలే ఇచ్చాయి. మోదీ ప్రభ తగ్గిందని కూసిన వారికి వాటితో చెంప చెల్లుమన్నంత పనైంది. మూడో సారి ప్రధాని పీఠం అలంకరించిన నరేంద్రుడి ఛరిష్మా తగ్గలేదని, ఆ మధ్య వెలువడిన కొన్ని రాష్ట్రాల్లోని ఫలితాలతో పోయిందేమీ లేదనే క్లారిటీ వచ్చింది. పనైపోయినట్టే అనుకున్న అపభ్రమ తొలగి, ప్రతిపక్షానికే పెను సవాల్ విసిరే స్థాయిగా ఉన్న బీజేపీ బలం కేడర్ లో కొత్త శక్తులను రేపుతుండగా, ఆయా రాష్ట్రాల్లో మరింత ఉన్నతికి బూస్ట్ మాదిరిగా దొరికింది. - జనపదం, బ్యూరో



## మింగడానికే మూసీ తొంపు..

- సుందరీకరణ పేరుతో లక్ష కోట్లు స్వాహా..
- పనులతో రాహుల్, ఆయన బావకు దోచి పెట్టొచ్చు
- గల్లా పట్టి అడిగే వరకు కాంగ్రెస్ మోసం సాగుతూనే ఉంటది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి రేవంత్ సర్కార్ పై నిప్పులు

4






## 21 నుంచి గ్రూప్ 1 మెయిన్స్..

- ఈ నెల 14 నుంచి అందుబాటులో హాల్ టికెట్లు
- మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు పరీక్ష..
- అదృష్టం పరీక్షించు కోనున్న 31,382 మంది అభ్యర్థులు

2




## నమూనాలన్నీ అతడివే..

- నిందితుడివిగా తేల్చిన పరిశోధనలు..
- కోల్కతా డాక్టర్ కేసులో కీలక సాక్ష్యాలు...
- సీబీఐ ఛార్జీషీట్లో ముఖ్యమైన పాయింట్లు..
- డీఎన్ఏతో సహా 11 రుజువులు..

4

## ఆ తర్వాతే కొత్త ఉద్యోగాలు..



- ముందు ఎస్సీ వర్గీకరణపై తేలాల్సిందే..
- 2011 జనాభా లెక్కలే ప్రామాణికం
- ఏకసభ్య న్యాయ కమిషన్ నివేదిక వచ్చాకే నూతన నోటిఫికేషన్లు
- కమిషన్ రిపోర్ట్ సమర్పణకు 60 రోజులు గడువు
- ఈ రెండు నెలల్లో బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే పూర్తి చేయాలి సీఎం రేవంత్ రెడ్డి
- సచివాలయంలో ఉపసంఘంతో సమీక్ష..

4

# ప్రతీ కార్యకర్త ముఖ్యమే

- వారి సమస్యల పరిష్కారమే తమ కర్తవ్యం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- గాంధీ భవన్ లో 'మంత్రులతో ముఖాముఖి'




**జనపదం, సిటీబ్యూరో:** ప్రజలతో పాటు ప్రతీ కార్యకర్త తమకు ముఖ్యమేనని, వారి సమస్యలను పరిష్కరించడమే తమ ముందున్న కర్తవ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున వారి సమస్యలు చెప్పుకోవడానికి గాంధీభవన్‌కు వస్తున్నారని అందులో భాగంగానే 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వారంలో రెండు సార్లు మంత్రులు వచ్చి వినతులను స్వీక రించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారని ఆయన అన్నారు. గాంధీ భవన్ మాత్రమే కాకుండా జిల్లా కేంద్రాల్లోని పార్టీ కా ర్యాలయాలకు మంత్రులు వెళ్లి కార్యకర్తలకు అండగా ఉండాలని ఆయన సూచించారు. బుధవారం 'గాంధీభవ న్‌లో 'మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి' మంత్రి పొన్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. చాలా మంది కార్యకర్తలను కలిసే అవకాశం ఈ వేదిక ద్వారా తమకు దొరికిందన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పుడు పార్టీ పరంగా పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన కార్యకర్తల సమస్యలను పరి ష్కారం చేయడానికి ఈ కార్యక్రమం బాగుందని, అందులో భాగంగా కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన అన్నారు.

### గల్ఫ్ బాధితుల కోసం ప్రజావాణి

ఉద్యోగాల నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారని ఆ దిశగా ప్రభుత్వం కూడా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొస్తుందని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరగా ప్రారంభించాలని ప్రజల నుంచి వినతులు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా నియంతలా తాము చెప్పిందే వినాలని కాకుండా అందరి దగ్గర నుంచి సలహాలు, సూచలను తీసుకుంటున్నామన్నారు. గల్ఫ్ బాధితుల కోసం ప్రజావాణి ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం తెలిపారు. గల్ఫ్ కార్మికులు మృతి చెందితే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

### బీసీ, ఎస్టీ, ఎస్సీలకు అండగా

విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ అన్నిరంగాల్లో తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు కూడా కాలేదని అప్పుడే తమ ప్రభుత్వం మీద అనేక విమర్శలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద సహాయక చర్యలు చేపట్టి ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరితే రూ. 400 కోట్లు మాత్రం కేటాయించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు తానా తందాన అన్నవిధంగా బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు, ఎస్సీ, ఎస్టీలకు అండగా ఉంటుందన్నారు. పరిపాలనకు సంబంధించి ఫాంహౌస్ నుంచి కాకుండా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ నుంచి ప్రజా పాలన అందిస్తున్నామన్నారు.

### జగదీశ్ రెడ్డి చర్చకు సిద్ధమా...?

ఇచ్చిన హామీలు అమలు చేశాం..., మిగిలిన హామీలు కూడా అమలు చేస్తామని మంత్రి చెప్పారు. కొంతమంది ప్రభుత్వం ఎన్నాళ్లు ఉండదు, పడిపోతదని ఇష్టం ఉన్నట్లు మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా వాళ్ల పద్ధతి మార్చుకోవాలని మంత్రి పొన్నం సూచించారు. ఎవ్వరూ ఎన్ని సెటైర్లు వేసినా ఉద్యోగ నియామకాలు చేపడతామన్నారు. తెలంగాణ వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని ఆయన అన్నారు. నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉద్యోగాలు ఇస్తామన్నారు. జగదీశ్ రెడ్డి పది నెలల పాలనపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. విదేశీ విద్యానిధి పథకం కింద గత ప్రభుత్వంలో 150 మందికి ఇచ్చిందని, తమ ప్రభుత్వం మాత్రం 500 మందికి ఇస్తుందన్నారు. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న వారంతా దసరా పండుగను కొత్త డబుల్ బెడ్ రూంలో చేసుకోవాలని మంత్రి సూచించారు. 'మంత్రుల ముఖాము ఖి కార్యక్రమం' ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. మొత్తం 179 వినతులు రా గా, రవాణా శాఖకు 42, వివిధ మంత్రులకు సంబంధించి 115, వివిధ జిల్లాలకు సంబంధించిన కలెక్టర్‌లకు ఇచ్చిన అర్జీలు 22 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రొహిన్ రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మన్లు శివసేన రెడ్డి, నూతి శ్రీకాంత్ గౌడ్, జేరిపటి జైపాల్, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



భార్య లంచం తీసుకుంటున్న భర్త

# మీరు గ్రేట్ సార్

### డబ్బు కట్టలు చూడండంటూ వీడియో

**జనపదం, క్రైం:** ఇప్పటి వరకు లంచగొండి అధికారులను బాధితులు ఏసీబీకి పట్టించడం చూశాం. తాజాగా.. ఓ భర్త తన భార్య లంచం తీసుకుంటుందని తీవ్ర ఆరోపణలు చేశాడు. అందుకు సంబంధించిన షాకింగ్ వీడియో బయటపెట్టారు. తన భార్య తెచ్చే లంచం డబ్బులు ఎక్కడెక్కడో పెడుతుందో చూడండి అంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్టు చేశాడు. ఇప్పుడా వీడియో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. మణికొండ మున్సిపల్ డీఈఈ దివ్య జ్యోతిపై ఆమె భర్త అవినీతి ఆరోపణలు చేయడం కలకలం రేపుతోంది. తన భార్య లంచం తీసుకోనిదే ఇంటికి రాదంటూ ఆమె భర్త శ్రీపాథ్ తీవ్ర ఆరోపణలు చేశాడు. ప్రతి రోజూ ఇంటికి లక్షలకు లక్షలు డబ్బు తెస్తుందన్నారు. మణికొండలో కాంట్రాక్టర్ల నుంచి పెద్ద ఎత్తున లంచం డబ్బులు తీసుకుంటుందని సంచలన విషయాలు వెల్లడించారు. ఈ మేరకు దివ్యజ్యోతి లంచాలకు ఇవే సాక్ష్యాలంటూ ఇంట్లో ఉన్న నోట్ల కట్టలను చూపించాడు. ఆ వీడియోలో ఇంట్లో ఎక్కడ చూసినా డబ్బు కట్టలే కనిపిస్తున్నాయి. అల్మారాలు, దేవుడి గది, కబోర్డ్‌లు, పిల్లోస్ ఇలా ఎక్కడా చూసినా కట్టలకు కట్టలు డబ్బులు కనిపించాయి. లంచం తీసుకోవడం నేరమని తాను ఎన్నిసార్లు హెచ్చరించినా.. తన భార్య ప్రవర్తన మార్చుకోవటం లేదని.. అందుకే వీడియోలు బయటపెట్టినట్లు శ్రీపాథ్ వెల్లడించారు. ప్రస్తుతం ఇంట్లోనే దాదాపు 20-30 లక్షల క్యాష్ ఉంటుందని అన్నారు. ఇటీవలే పుప్పాలగూడలో దాదాపు రెండు కోట్ల విలువైన అపార్ట్ మెంట్ కొనుగోలు చేసిందని ఆరోపించారు. 30 లక్షలు పెట్టి ప్రస్తుతం ఇంటీరియర్ వర్క్ చేయిస్తుందని చెప్పారు. లంచం డబ్బులను తన ఇద్దరు తమ్ముళ్లకు పంపిస్తుందని.. వారి అకౌంట్లలో దాదాపు 70-80 లక్షలు ఉంటాయన్నారు. దివ్యజ్యోతి గత కొంత కాలంగా తనను దూరం పెట్టిందని.. కుమారుడిని కూడా చూడనివ్వటం లేదని వాపోయాడు. ఆమె లంచం విషయంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా తనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నాడు. కాగా, భార్య లంచం డబ్బుల వీడియోను బయటపెట్టిన శ్రీపాథ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. మీరు గ్రేట్ సార్ అని పొడుగుతున్నారు. అందరు భర్తలు, భార్యలు, కుటుంబ సభ్యులు మీలాగే ఉంటే ఏ ఉద్యోగి లంచం తీసుకోడని తమ అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు.

## మంత్రి సీతక్క చొరవ.. మున్సిపల్ సమ్మె విరమణ



**జనపదం, నిర్మల్:** నిర్మల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మికులు తొమ్మిది రోజులుగా చేస్తున్న సమ్మె మంత్రి సీతక్క చొరవతో బుధవారం విరమించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ సెలవులో ఉండడంతో ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క సూచనతో పారిశుధ్య కార్మికులు ఎస్పీ జానకి షర్మిలను కలిశారు. దీంతో ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కతో ఎస్పీ ఫోన్ లో మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల సమ్మె విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి నెలరోజుల వేతనం చెల్లించేందుకు హామీ ఇచ్చారు. పెండింగ్ వేతనాలు త్వరలోనే చెల్లిస్తామని వారికి భరోసా కల్పించారు. దీంతో కార్మికులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే స్పందించి మంత్రి సీతక్కతో మాట్లాడి వేతనాలు చెల్లించేందుకు కృషి చేసిన ఎస్పీ జానకి షర్మిలకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రూప్ -1 మెయిన్స్‌కు వేళాయే

**14 నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్**

**21 నుంచి 27 వరకు పరీక్షలు**



**జనపదం, ఎడ్యుకేషన్:** గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో త్వరలోనే హాల్ టికెట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 14న టీజీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. అభ్యర్థులంతా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఓ ప్రకటనలో సూచించింది. ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగనున్న విషయం తెలిసిందే. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు పరీక్ష జరుగనున్నది. పరీక్ష హాల్‌లోకి మధ్యాహ్నం 12.30 గంటల నుంచే అభ్యర్థులను అనుమతించనున్నట్లు పేర్కొంది. ఇక గ్రూప్-1 మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. 3.02లక్షల మంది అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే. మెయిన్స్ పరీక్షలు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. మెయిన్స్ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్ తప్ప మిగిలిన పేపర్లన్నీ అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాల్సి ఉంటుంది. గ్రూప్-1 మెయిన్స్‌లో మొత్తం ఆరు పేపర్లు ఉండనున్నాయి.

# ప్రాంతీయ పార్టీగానే బీఆర్ఎస్

- కేసీఆర్ కాన్సెప్ట్ జస్ట్ సైడ్
- ప్రాంతీయ నినాదంతోనే కేటీఆర్
- లోకల్ పార్టీలదే హవా అంటూ కేటీఆర్ స్పీచ్
- పేరు మార్పుకు తాత్కాలిక బ్రేక్
- బీఆర్ఎస్ పేరుతోనే ప్రాంతీయ నినాదం

**జనపదం, హైదరాబాద్:** జాతీయ స్థాయి రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావించి చతికిల పడిన బీఆర్ఎస్ పార్టీ ఇక ప్రాంతీయ పార్టీగానే కొనసాగాలని నిర్ణయించుకుంది. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు దేశ రాజకీయాల్లో హడావిడి చేసిన ఆ పార్టీ ప్రస్తుతం.. తెలంగాణకే పరిమితం కానుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవి చూసి.. అధికారాన్ని కోల్పోయింది. దీంతో అప్పటి నుంచి ఆ పార్టీ జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం పక్కన పెట్టింది. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావడం.. అప్పటి వరకు పార్టీని, నేతలను కాపాడుకునే అంశంపైనే దృష్టి సారించింది. పైగా పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండడంతో.. బీఆర్ఎస్ (భారతీయ రాష్ట్ర సమితి) కూడా రాష్ట్రానికే పరిమితం అవ్వాలని నిర్మయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఇందుకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు సైతం ఇందుకు ఊతమిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలతే హవా అని..తమ పార్టీ ఎదుగుతుందని సంకేతాలు పంపుతున్నారు.

### టీఆర్ఎస్ టు బీఆర్ఎస్

కొన్నాళ్ల క్రితం వరకు తెలంగాణ ఇంటి పార్టీగా ఉన్న టీఆర్ఎస్ ను ప్రజల మనసుల్లోకి ఆ పార్టీ అధినేత కేసీఆర్ బలంగా తీసుకెళ్లగలిగారు. తర్వాత ఆ పార్టీ పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చారు. అంటే పేరుతో తెలంగాణను తీసేసి జాతీయ వాదం తెచ్చారు. తమది




జాతీయ పార్టీ అని ప్రకటించారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ విస్తరణ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ తెలంగాణలోనే అధికారం కోల్పోవడం.. ఒక్క ఎంపీ సీటు కూడా గెలవకపోవడంతో ఆ ప్రయత్నాలన్నీ నీరుగారిపోయాయి. ఇప్పుడు తమ పార్టీ జాతీయ పార్టీ కానే కాదని.. లోకల్ పార్టీ అని కేటీఆర్ నమ్మించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అయితే టీఆర్ఎస్ ను బీఆర్ఎస్‌గా మార్చేసిన అంశం కూడా ప్రజల్లోకి బలంగా వెళ్లింది. తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరును ఇప్పుడు పల్లెల్లో కూడా క్యాడర్ అనడం లేదు. బీఆర్ఎస్ అనే అంటున్నారు. అంతగా ప్రజల్లోకి వెళ్లిపోయింది. పైగా కేసీఆర్ జాతీయ రాజకీయాల కోసం తెలంగాణ పార్టీని వదిలేశారని కూడా అనుకుంటున్నారు. ఈ భావన పోయేలా చేయడానికి బీఆర్ఎస్ పార్టీని మరోసారి టీఆర్ఎస్ గా మార్చాల్సి ఉంది. కానీ ఓ సారి పార్టీ పేరు మార్చినందున ఆ పార్టీ పేరును ఈసీ ఫ్రీజ్ చేస్తుంది. మరోసారి ఆ పేరు కేటాయించడం అంత తేలికైన విషయం కాదు. అందుకే ఈ విషయంలో బీఆర్ఎస్ పెద్దలు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. పేరు మార్పు చేయగలిగితే అంత కన్నా రిలీఫ్ ఉండదని అనుకుంటున్నారు. ఆ ప్రయత్నాలు చేస్తున్నారు. మరి వారి ప్రయత్నాలు ఫలించి బీఆర్ఎస్ ను తెలంగాణ ప్రజలు తమ ఇంటి పార్టీగా భావిస్తారా? లేదా? అన్నది భవిష్యత్తులో తేలనుంది. అప్పటి వరకు బీఆర్ఎస్ నేతలకు తిప్పులు తప్పేలా లేవని తెలుస్తోంది.

# పత్తి కొనుగోలుకు రెడీగా ఉండాలి

- రాష్ట్రంలో 25.33 లక్షల టన్నుల దిగుబడి అంచనా
- కలెక్టర్ల పర్యవేక్షణలో కొనుగోళ్ల ప్రక్రియ
- సాయంత్రం 6వరకూ విక్రయాలు
- రైతులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- మంత్రి తుమ్మల హెచ్చరిక



**జనపదం, సిటీబ్యూరో:** పత్తి కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 42.23 లక్షల ఎకరాలలో పత్తి సాగు జరిగినట్టు ఇప్పటికే వ్యవసాయశాఖ నిర్ధారించగా, 25.33 లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్టు తెలిపారు. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా మంత్రిగా ఆదేశించారు. ఇదివరకే మంత్రి గత నెల 9న తేదీన కాటన్ కార్పొరేషన్ సీఎండీతోపాటు రాష్ట్ర జిన్నింగ్ మిల్లర్లతో సచివాలయంలో సమావేశమై మిల్లర్లు టెండర్ లో పాల్గొనేలా ఒప్పించారు. దీంతో 351 జిన్నింగ్ మిల్లులలో 319 జిన్నింగ్ మిల్లర్లు టెండర్ లో పాల్గొన్నాయి. వీటిని నోటిఫైడ్ కేంద్రాలుగా ప్రకటించే అధికారం ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. అదేవిధంగా పత్తి మార్కెటింగ్ సీజన్ పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా కమిటీల ఏర్పాటు చేసి, ఆయా కమిటీల ద్వారా రాష్ట్రంలో పత్తి మార్కెటింగ్ సజావుగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ శాఖ ద్వారా పత్తి రైతుల వివరాలు ఇప్పటికే సేకరించినందున, మార్కెటింగ్ శాఖ వారి పత్తి కొనుగోలు సాఫ్ట్‌వేర్‌లో ఈ రైతుల వివరాలను సులువుగా గుర్తించే ఏర్పాటు చేసినట్టు మార్కెటింగ్ అధికారులు మంత్రి కి తెలియజేశారు. అంతేగాక ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ సంవత్సరం రైతులకు సులువుగా పత్తి అమ్మేందుకు అదనపు వివరాలు వాట్సాప్ ద్వారా తెలియజేస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా పత్తి కొనుగోలు కేంద్రాలు సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే కొనసాగుతాయని సీసీఐ అధికారులు తెలుపగా, రైతుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్రంలో సాయంత్రం 6 గంటల వరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పత్తి రైతులందరు పత్తి పంట నాణ్యత ప్రమాణాలను పాటించి మద్దతు ధర క్వింటాలకు రూ. 7521 పొందాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ కార్యదర్శులు, అధికారులు అందుబాటులో వుండి రైతులకు పూర్తిస్థాయి సేవలు అందించాలన్నారు. ఎక్కడైనా రైతులకు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు తలెత్తితే, సంబంధిత అధికారుల మీద చర్యలు తప్పవని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.



## విపత్తుపై అప్రమత్తం..

**డిజాస్టర్ మేనేజ్మెంట్ విధానాలను సమర్థవంతంగా రూపొందిస్తాం**

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

**జనపదం, సిటీబ్యూరో:** నగరంలో వరదలు, కారణాలు, ఉపశమన చర్యల (డిజాస్టర్ మేనేజ్మెంట్)పై బుధవారం హైడ్రా కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమీక్ష చేశారు. బెంగళూరులో అనుసరిస్తున్న విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కర్ణాటక రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ కేంద్రం మాజీ డైరెక్టర్ డా. జీఎస్ శ్రీనివాస్ రెడ్డి వివరించారు. అలాగే హైదరాబాద్ లో 'హైడ్రా' పనిచేస్తున్న విధానాల గురించి అక్కడి అధికారులకు కమిషనర్ రంగనాథ్ తెలియజేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. బెంగళూరుతో పాటు దేశంలోని ఇతర పట్టణాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి సమన్వయంతో మెరుగైన వ్యవస్థను రూపొందించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం నగరంలో అనుసరిస్తున్న డిజాస్టర్ మేనేజ్మెంట్ విధానాలను మరింత సమర్థవంతంగా, సమన్వయంగా రూపొందించడం, ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి.. యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచే పని చేస్తున్నామని తెలిపారు. వాతావరణ కాలుష్యం, ఇతర కారణాలతో నెలలో పడే వర్షం ఒక్క రోజులో.. ఒక్క రోజులో పడే వర్షం గంట, అరగంటలో కురవడంతో తలెత్తుతున్న ఇబ్బందులను ఎదుర్కొనేలా తీసుకునే చర్యలపై అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. ప్రాంతాలవారీ వెదర్ రిపోర్టు ప్రజలకు చేరేలా చర్యలు, ఎంత వర్షం పడుతుందో, వరద ముప్పు, వడగళ్లతో పాటు పిడుగుపాట్ల హెచ్చరికలు కూడా ప్రజలకు తెలిజేసేలా చర్యలుంటాయని వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డివిజన్ల వారీ వెదర్ స్టేషన్ల నుంచి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు రహదారుల్లో కిలోమీటర్ల మేర వర్షపు నీరు ప్రవహించకుండా ఎక్కడికక్కడ వరద నీటి కాలువల్లోకి నీరు చేరేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరదలు, ముంపు సంభవిస్తుందని గ్రహించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. అలాగే నాలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోబోతున్నామని వివరించారు.

# ఫార్మా విలేజ్ వద్దేవద్దు..

**పాదయాత్ర చేపట్టిన రైతులు**

**ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు**

**జనపదం, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటును నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన మహాపాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. పాదయాత్ర కోసం బయలుదేరిన నేతలను వికారాబాద్ జిల్లా బొమ్రాస్ పేట మండలం తుంకిమెట్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని పరిగి తరలించారు. హకీంపేట రేణుకా ఎల్లమ్మతల్లి దేవాలయం నుంచి హకీంపేట, ఆర్బీ తండా, లగచర్ల మీదుగా దుద్యాల్ తహసీల్దార్ కార్యాలయం వరకూ పాదయాత్ర కొనసాగాల్సి ఉండగా బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున హకీంపేటకు చేరుకున్నారు. నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ హకీంపేటకు చేరుకుని పాదయాత్రకు అనుమతి లేదని ఆందోళన కారులకు తెలిపారు. దీంతో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు పట్నం నరేందర్ రెడ్డి ఆందోళనకు మద్దతు తెలిపాడు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు పట్నం నరేందర్ రెడ్డి సహా రైతులను అరెస్ట్ చేశారు.

### 25రోజులుగా దీక్ష

ఫార్మా విలేజ్‌పై మొదటి నుంచి స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. పోలెపల్లి, హకీంపేట, నగచర్ల, దుద్యాల, పులిచర్లకుంట తండాలో సుమారు 1700 ఎకరాల్లో ఫార్మా విలేజ్ పేరుతో ఔషధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాలుష్య కారకాలు వెదజల్లే పరిశ్రమలకు



ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇవ్వబోమంటూ ఆయాగ్రామాల రైతులు ఆందోళనబాట పట్టారు. హకీంపేట చౌరస్తాలో సుమారు 25రోజుల నుంచి నిరాహార దీక్షలు చేశారు. ఇందులో భాగంగానే బుధవారం పాదయాత్రకు సిద్ధమయ్యారు.

### రిజిస్ట్రేషన్లు ఆపేశారు

ఫార్మా విలేజ్ కోసం భూముల సేకరణకు ఎంపిక చేసిన గ్రామాల్లో అంతా సన్న, చిన్నకారు రైతులే ఉన్నారని బాధితులు చెబుతున్నారు. ఎకరాకు 10లక్షల పరిహారం, ఇంటిస్థలం, ఇళ్లు ఇస్తామని అధికారులు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికే ఫార్మా విలేజ్ వస్తుందన్న పేరుతో తమ భూములు రిజిస్ట్రేషన్, క్రయ విక్రయాలు జరుపుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటరుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సైతం ముందుకు రావట్లేదని వాపోతున్నారు. భూములివ్వబోమని అధికారులకు ఇప్పటికే తేల్చి చెప్పినట్లు వెల్లడించిన రైతులు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ధరలు పెంచొద్దు..

- ఆదాయం పెంచే మార్గాలు అన్వేషిస్తాం
- ప్రణాళికలు చేయండి
- రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంపు అంశంపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష



**జనపదం, బ్యూరో:** ధరలు పెంచకుండా, రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెరిగే మార్గాలను అన్వేషించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్థికశాఖతో పాటు ఖజానాకు ఆదాయాన్ని అందించే వాణిజ్యపన్నులు, ఎక్సైజ్, ఆర్అండ్‌బీ, గనులు, పురపాలక, గృహనిర్మాణ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం సచివాలయంలో సమావేశమయ్యారు. రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచే అంశంపై నిర్దిష్ట ప్రణాళికతో అధికారులు సమావేశానికి రావాలని సూచించారు. గతంలో నిర్దేశించుకున్న ప్రణాళికలు వాటి ప్రగతిని నివేదించాలని సూచించారు. లీకేజీలను అరికడుతూ ఆదాయం పెంచేందుకు కమర్షియల్ టాక్స్ కమిషనర్, జాయింట్ కమిషనర్, విభాగాల అధిపతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. మద్యం దుకాణాల్లో ఎంఆర్పీ క న్నా అధికంగా రేట్లతో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఖజానాకు ఆదాయం పెంచేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అందుకోసం ప్రత్యేకంగా ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణా, పనుల ఎగవేతను కట్టడి చేయడానికి వాణిజ్య పన్నులు, ఆర్ అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు సమావేశమై నివేదిక రూపొందించాలని అన్నారు. నిర్మాణాలు పూర్తిచేసి పెండింగ్‌లో ఉన్నరాజీవ్ స్వగృహ, గృహనిర్మాణ శాఖ పరిధిలోని ఇండ్లను విక్రయించే అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇసుక రీచ్‌ల ద్వారా ఖజానాకు గరిష్ట ఆదాయం సమకూరేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీనియర్ అధికారులు సమావేశమై నివేదిక ఇవ్వాలని భట్టివిక్రమార్క ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, మైనింగ్ సెక్రటరీ సురేంద్రమోహన్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, హౌసింగ్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# కెనడాలో బతుకమ్మ సంబురాలు

**తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం ఆధ్వర్యంలో వేడుకలు**

**జనపదం, బ్యూరో:** కెనడా ప్రముఖ నగరం టొరంటోలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కడ స్థిరపడిన వందలాది మంది తెలంగాణ వాసులు కుటుంబాలతో సహ హాజరై బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం (టీడీఎఫ్) కెనడా నేతృత్వంలో పనిచేసే తంగేడు సాంస్కృతిక సంస్థ ఈ వేడుకలను నిర్వహించింది. పుట్టి పెరిగిన తెలంగాణ నేలకు వేల మైళ్ల దూరంలో ఉన్నా, సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించాలని, కెనడాలో పుట్టిన పిల్లలకు పండగల ప్రాధాన్యతలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఏటా బతుకమ్మతో సహా బోనాలు, ఇతర పండగలను నిర్వహిస్తున్నామని తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం తెలిపింది. ప్రకృతి, పర్యావరణంతో అలరారే కెనడాలో లభించే రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మ పండగ సంబురాలకు మరింత వన్నె తెచ్చాయి. టొరంటోలో బ్రాంప్టన్ వేదికగా విశాలమైన సెకండరీ స్కూల్ ఈ వేడుకలకు వేదిక అయింది. సుష్మ సాయి, అమితా రెడ్డిలు సమన్వయం చేసి పెద్ద సంఖ్యలో మహిళలు కుటుంబాలతో సహా



పాల్గొనేలా చేశారు. సంబురాల్లో పాల్గొన్న అందరికీ కమిటీ పసందైన తెలంగాణ వంటలతో విందును ఏర్పాటు చేసింది. గత ఇరవై ఏళ్లుగా తెలంగాణ ఉత్సవాలను, బతుకమ్మ పండగను నిర్వహిస్తున్నామని టీడీఎఫ్ ఫౌండేషన్ కమిటీ చైర్మన్ సురేందర్ పెద్ది తెలిపారు. వేడుకలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసిన అందరికీ టీడీఎఫ్ (కెనడా) ప్రెసిడెంట్ జితేందర్ రెడ్డి గార్లపాటి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ శ్రీకాంత్ నేరవెట్ల, వైస్ ప్రెసిడెంట్ ప్రమోద్ ధర్మపురి, వెంకట రమణా రెడ్డి మేద, తదితరులు పాల్గొన్నారు.


Read Share Follow
janapadam
@janapadam
#janapadam



## సీఎంతో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల భేటీ

- తన మనవరాలి పెళ్లికి రావాలంటూ రేవంత్‌కు ఆహ్వాన పత్రిక అందచేసిన మల్లారెడ్డి

**జనపదం, బ్యూరో** : సీఎం రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ ఇంటికెళ్లిన మల్లారెడ్డి ఆయన్ను కలిశారు. తన మనవరాలి పెళ్లికి రావాలంటూ ఆహ్వాన పత్రికను అందజేశారు. కాగా, రేవంత్‌ను కలిసిన సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా అక్కడే ఉన్నారు. అయితే రేవంత్ రెడ్డి, మల్లారెడ్డి భేటీపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం ఏపీ చంద్రబాబును సైతం మల్లారెడ్డి కలిశారు.



## బాధ్యతలు స్వీకరించిన పట్నం..

- శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు

**జనపదం, సెక్రటేరియట్ :** రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ గా పట్నం మహేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరై పట్నంకు అభినందనలు తెలిపారు. అనంతరం స్పీకర్ మీడియాతో మాట్లాడారు. చట్టసభల్లో సుదీర్ఘ అనుభవమున్న మహేందర్ రెడ్డికి మండలి చీఫ్ విప్ రావడం సంతోషకరం అన్నారు. మండలిలో శాసన తయారీ ప్రక్రియ, చర్చ లాంటి అంశాల్లో తోటి సభ్యులకు చేదోడువాదుడుగా పట్నం ఉంటారన్నారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలి చీఫ్ విప్ గా అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందరితో కలిసి చట్టసభల ద్వారా ప్రజలకు అందుబాటులో వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. స్పీకర్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామన్నారు. తదనంతరం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాదపూర్వంగా కలిశారు. కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ నర్సింహాచార్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.



## సిద్దిపేట ప్రజలందరికీ బతుకమ్మ శుభకాంక్షలు..

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హారీష్ రావు**

**జనపదం, సిద్దిపేట :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీకైనా బతుకమ్మ పండుగ ను జిల్లా ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బతుకమ్మ పండుగా సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని అలాంటి సంస్కృతి మన తెలంగాణలో ఉందన్నారు. మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. తొమ్మిది రోజుల పాటు తిరొక్క పూలతో ప్రతి రోజు వేడుకగా ఆడపడుచులు జరుపుకున్న గొప్ప పండగ అని చివరి రోజు సద్దుల బతుకమ్మ పెద్ద బతుకమ్మ గా జరుపుకుంటామని గ్రామాల్లో చెరువుల వద్ద వాగులవద్ద ఇంటిల్లిపాది సద్ది లు కట్టుకొని చేసుకొనే తెలంగాణ సాంప్రదాయాన్ని పరిడవిల్లె పండగ బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తూ రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు. ప్రతి ఏటా తెలంగాణ ప్రభుత్వ బతుకమ్మ కానుకగా ఆడపడుచులలు చీరల పంపిణీ చేసామని గుర్తు చేశారు. ఈ పండుగను ప్రజలందరు వేడుకగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని హరీష్ కోరుకున్నారు.

# పండగ వేళ.. ప్రత్యేక దోపిడి

- దసరాకు ప్రయాణ భారం
- స్పెషల్ బస్సులు అంటూ 25 శాతం ఎక్కువ ధర
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు




**జనపదం, బ్యూరో :** సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం అన్ని ఏర్పాట్లను చేసింది. ప్రత్యేకంగా బస్సు సర్వీసులను నడుపుతోంది. తె లంగాణలోని వివిధ జిల్లాలతో పాటు గా పక్క రాష్ట్రాలకు కూడా బస్సు ప్ర త్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చే సింది. అయితే ఈ స్పెషల్ బస్సుల్లో ఛార్జీలు పెంచారని ప్రయాణికులు ల బో దిబోమంటున్నారు. సాధారణ ఛా ర్జీల కంటే స్పెషల్ బస్సుల్లో దాదాపు 25 శాతం అధికంగా ఉన్నట్లు ఓ ప్ర యాణికుడు వాపోయాడు. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి నల్గొండకు సా ధారణ ఛార్జీ రూ.200 ఉంటే.. ప్రస్తు తం రూ. 250 వసూలు చేస్తున్నారు. నలుగురు కుటుంబ సభ్యులు ఊరె ళితే.. దాదాపు 200 అదనంగా ఛార్జీలు అవుతున్నాయి. దీంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిత్యవసర ధరలు ఆకాశన్నంటగా.. పండుగ వేళ ఆర్టీసీ అదనపు ఛార్జీలతో తమ జేబులకు చిల్లు పడుతోందని వాపోతున్నారు. ఈ టికెట్ల ధరల వ్యవహారంపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా.. అన్ని బస్సుల్లో అదనపు ఛార్జులు వసూలు చేయంట లేదని.. కేవలం స్పెషల్ బస్సులకే మాత్రమే ఈ ధరలు వర్తిస్తాయని చెబుతున్నారు.

**6304 ప్రత్యేక బస్సులు**

సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 6304 ప్రత్యేక బ స్సులను ఏర్పాటు చేశారు. ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంతో రద్దీ దృష్ట్యా గత ఏడాదితో పోల్చితే అదనంగా 600 స్పెషల్ సర్వీసులను తిప్పాలని ఆర్టీసీ నిర్ణయించింది. నేటి నుంచి ఈనెల 12 వరకు అధిక రద్దీ ఉండే అవకాశముండటంతో.. ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతోంది. జేబీఎస్ నుంచి 1602, ఎల్బీ నగర్ నుంచి 1193, ఉప్పల్ నుంచి 585, ఆరాంఘర్ నుంచి 451 అదనపు బస్సులను నడుపుతున్నారు. తిరుగు ప్రయాణంలో రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 13, 14 వ తేదిల్లోనూ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నా మని ఆర్టీసీ అధికారులు వివరించారు.

**పది శాతం పెంపు..?**

టికెట్ ధరల పెంపుపై సంస్థ రహస్యంగా దాచి పెడుతున్నది. ఇటీవల టోల్‌ఛార్జీల రూపంలో టోల్ సెస్ అంటూ దాదాపు వందకు రూ. 10 వరకు పెంచింది. ఇప్పుడు దసరాకు సాధారణ ఛార్జీలే అంటూ ఊదరగొట్టి.. ప్రత్యేక ధరలను వసూలు చేస్తున్నారు. మొన్నటిదాకా సందుబొందులు, గ్రామాలకు తిప్పిన బస్సులనే స్పెషల్ బస్సులు అంటూ దూర ప్రాంతాలకు పంపిస్తున్నారు. అవే బస్సుల్లో ప్రత్యేకం పేరుతో చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారు.

## వంచించి ప్రశ్నిస్తరా..?

- సన్నవడ్లకు బోనస్ గురించి హరీష్ ప్రశ్నించడం విడ్డూరం
- మాజీమంత్రిపై మంత్రి సీతక్క ధ్వజం
- పదేళ్లలో చేయలేనిది మేం ఒకే సారి రుణమాఫీ చేశామని వెల్లడి

**జనపదం, బ్యూరో:** సన్నవడ్లకు బోనస్ ఇస్తామని `మాజీ సీఎం కేసీఆర్ పాలకుర్తి సభలో హామీ ఇచ్చి రైతులను వంచిస్తే.. మీరు తొర్రూరు సభలో బోనస్ గురించి ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. హరీష్ రావు వ్యవహార శైలి గురువింద నీతిని గుర్తుకు తెస్తుందని ఆమె విమర్శించారు. బుధవారం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ రైతు రుణ మాఫీ, సన్నవడ్లకు బోనస్ అంశాలపై హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు గట్టిగా బదులిచ్చారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని రుణ మాఫీని మేం ఒకే పంట కాలంలో చేశామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కన్నా లక్షన్నర మంది రైతులకు అదనంగా ఇప్పటికే రుణ మాఫీ చేశామని వివరించారు. 2018 నుంచి 2023 వరకు ఐదేండ్లలో లక్ష లోపు పంట రుణాలను ఆర్థిక మంత్రిగా వెలగబెట్టిన మీరు ఐదు విడతల్లో అరకొరగా రుణ మాఫీ చేశారని హరీశ్‌రావుకు చురకలు వేశారు. మీ లెక్కల ప్రకారమే 21.35 లక్షల మంది రైతులకు రుణ మాఫీ కోసం రూ.11,910 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారని, అయితే అది కూడా విడతల వారిగా చెల్లించడంతో, అది వడ్డీకే సర్దుబాటు అ య్యిందని మంత్రి సీతక్క అన్నారు. దీంతో రైతులు రు ణ విముక్తులు కాలేదన్నది చాలా స్పష్టంగా ఉందని అన్నారు. తమ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఒకే పంట కాలంలో ఏకంగా రూ.18 వేల కోట్ల రుణాలను ఏక కాలంలో మాఫి చేసి 23 లక్షల మంది రైతులను



రుణ విముక్తుల్ని చేసి వారి గుండెల మీద భారాన్ని దించిందని తెలిపారు. మిగిలిన పంట రుణాలను మాఫి చేస్తామనే నమ్మకంతో రైతులు నిశ్చింతగా ఉన్నారని వివరించారు. మీరు ఐదేండ్లలో చేయలేని పనిని, మేము కేవలం 27 రోజుల్లోనే చేసి చూపించామని, ఇదీ రైతుల పట్ల మా ప్రభుత్వ భరోసా అని అన్నారు. కాగా, పది నెలలుగా ఫీజు రీయింబర్స్ మెంట్ చేయలేదని విద్యార్థుల మీద హరీష్ కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హర్యానాలో బీజేపీ విజయంతో ఇక్కడ బీఆర్ఎస్ నేతలు సంబురపడటం చూస్తే ఆ రెండు పార్టీలు ఒకటే అని మరోసారి రుజువయ్యిందని ఎద్దేవా చేశారు.

## చెప్పిందే చేశాను..

### వాళ్లవి ఊస్ట్.. వీళ్లకు పోస్ట్..

- బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించలేదు
- ఆ నలుగురి జాబ్స్ పోయాకే యువతకు ఉద్యోగాలు..
- డీఎస్సీ విజేతలను చూస్తే ముందే పండుగొచ్చింది...
- తెలంగాణ నిర్మాణంలో టీచర్లు పాత్ర కీలకం..
- భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలి..
- సీఎం రేవంత్ రెడ్డి
- డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల అందజేత..

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పానని, చెప్పినట్టుగానే వాళ్ల కొలువులను ఊడగొట్టానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారని, వారు అనుకున్నట్టుగానే 90 రోజుల్లో 30 వేల కొలువులు భర్తీ చేసి నియామకపత్రాలు అందించామని సీఎం పేర్కొన్నారు. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్‌ను అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేశారని తెలిపారు. తెలంగాణ నిర్మాణంలో టీచర్లు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా మారబోతున్నారన్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు.

**పదేళ్లు కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నారు..**

డీఎస్సీ విజేతలను చూస్తే దసరా ముందే వచ్చినట్లు అనిపిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణకు పదేళ్లు కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నారని సీఎం రేవంత్ తెలిపారు. ఆ కొరివి దెయ్యాన్ని రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని సీఎం ఆరోపించారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామకపత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. టీచర్లకు సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. నియామక పత్రాలు పంపిణీకి ముందు సీఎం రేవంత్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశిస్తే నిరాశే ఎదురయ్యిందని తెలిపారు. గత ప్రభుత్వం తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని



సీఎం ధ్వజమెత్తారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తయిందని ఆయన విమర్శించారు.

**65 రోజుల్లో 10,006 ఉద్యోగాలు..**

డీఎస్సీ ద్వారా 65 రోజుల్లో 10,006 ఉద్యోగాల నియామక ప్రక్రియ పూర్తి చేశామని, తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర కీలకంగా మారిందని సీఎం రేవంత్ తెలిపారు. గతంలో విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతులు లేవని, విద్యాశాఖ తన దగ్గరే ఉందని, సమస్యలు పరిష్కరించామని సీఎం తెలిపారు. టీచర్లే తెలంగాణ వారధులు, నిర్మాతలని అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు, నిర్మాతలు అని సీఎం రేవంత్ కొనియాడారు. పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చే బాధ్యత టీచర్లదేనంటూ బాధ్యత అప్పగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు సుముఖంగా లేరని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ టీచర్లకంటే అనుభవజ్ఞులు ఉన్నారా..? అని ప్రశ్నించారు.

**రూ.25 వేలు కోట్లు కేటాయించాం..**

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో రూ.125 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటిని ఈ నెల 11వ తేదీన ప్రారంభించుకోబోతున్నామని సీఎం తెలిపారు. బడ్జెట్‌లో విద్యకు రూ.25 వేల కోట్లు కేటాయించామన్నారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నామని గర్వంగా చెప్పుకునేలా వ్యవస్థను తయారు చేస్తామన్నారు. తెలంగాణలో ప్రతి ఏటా లక్షా 10 వేల మంది ఇంజినీరింగ్ పూర్తి చేసి బయటకు వస్తున్నారని, కానీ ఉద్యోగాలు పొందలేక చాలామంది ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పించబోతున్నామని పేర్కొన్నారు. త్వరలో గచ్చిబౌలిలో స్పోర్ట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని సీఎం తెలిపారు. మీరే తెలంగాణ భవిష్యత్ నిర్మాతలు, తెలంగాణ పునర్నిర్మాణానికి మీవంతు కృషి చేయాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

## నియ్యతి లేని నేత నీతి జెప్పవట్టే..

**(మొదటిపేజీ తరువాయి)** నియామక పత్రాల అందజేత సందర్భంగా ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చేసిన వ్యాఖ్యలకు హరీష్ ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సొమ్మును తెలంగాణ నిర్మాత కేసీఆర్ ను తిట్టడానికి మాత్రమే వాడుతున్నారని, సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన టీచర్ల మెదళ్లలో అసభ్యకరమైన భాషను ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాడు సంస్కారహీన సీఎం అని దుయ్యబట్టారు. కేసీఆర్ ను కొరివి దయ్యం అని తెలంగాణ ద్రోహులు తప్ప ఎవ్వరూ అనరని, తెలంగాణ ఉద్యమంలో రేవంత్ లాంటి ఎన్నో కొరివి దయ్యాలను తుదముట్టించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను నిజం చేసిన ఉద్యమ సూరీడు కేసీఆర్ అనే విషయం మరిచిపోవద్దన్నారు.

**ద్రోహి రేవంత్..**

తెలంగాణ రావడం ఇష్టం లేని మాతృ ద్రోహి రేవంత్ కు ఈ మట్టి బిడ్డ కేసీఆర్ త్యాగాలు ఎలా కనిపిస్తాయని హరీష్ ప్రశ్నించారు. ఆయన లాంటి కొరివి దయ్యాన్ని తెచ్చుకుని పొరపాటు చేశామని తెలంగాణ సమాజం పాశ్చాతాపంతో ఉందన్నారు. కర్మకాలి ఆయనలాంటి వాడికి 2014 లో అధికారం ఇస్తే తెలంగాణ వాడిని ఎప్పుడో అమ్మేసేవాడన్నారు. కేసీఆర్ చేతిలో తెలంగాణ సురక్షితంగా ఉంది కనుకే రేవంత్ సీఎం కాగలిగారని, ఆయన సీఎం అనే ఉద్యోగం కూడా కేసీఆర్ చలవే అని గుర్తు పెట్టుకోవాలన్నారు.

**నియ్యతి లేని నేత..**

రేవంత్ అందజేస్తున్న నియామక పత్రాలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చింది బీఆర్ఎస్ అని, ఫైనాన్స్ క్లియరెన్స్ ఇచ్చిందీ బీఆర్ఎస్, పరీక్షలు నిర్వహించింది కూడా బీఆర్ఎస్ అనే ముచ్చట మరువొద్దన్నారు. అన్నీ బీఆర్ఎస్ పార్టీ చేసిన తర్వాత ఈయనొచ్చి ఏదో చేసినట్టు ఫోజులు కొట్ట డం, వంటం తా అయిన తర్వాత గంటె తిప్పినట్టుగా ఉందన్నారు. నియ్యతి ఉన్నోడైతే నిజాలు చెబుతాడని, రేవంత్ రెడ్డి డిక్షనరీలోనే నియ్యతి లేదని అందుకే అబద్ధాలు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు.

**నర్సుల నియామకాల దగ్గర అంతే..**

రేవంత్ నియామక పత్రాలు ఇచ్చిన స్టాఫ్ నర్సుల ఉద్యోగాలకైనా, సింగరేణిలో ఇచ్చిన ఉద్యోగాలకైనా, పోలీసు ఉద్యోగాలకైనా, టీచర్ల ఉద్యోగాలకైనా నోటిఫికేషన్లు ఇచ్చింది బీఆర్ఎస్సే, పరీక్ష నిర్వహించింది బీఆర్ఎస్సే అన్నారు. నియామక పత్రాలు ఇచ్చినంత మాత్రాన ఉద్యోగాలు కాంగ్రెస్ ఇచ్చినట్లా? నోటిఫికేషన్లు లేకుండా, పరీక్షలు నిర్వహించకుండా, ఏకంగా నియామకపత్రాలు ఇవ్వడం కుదురుతుందా..? రేవంత్ చెప్పాలన్నారు.

**ఇది మా ఘనత..**

2017లో టీఎస్పీఎస్సీ ద్వారా 8792 టీచర్ పోస్టులు భర్తీ చేశామని, గురుకులాల్లో 11వేలకు పైగా టీచర్ పోస్టులు నింపామని, అలాగే గురుకులాల్లో 12వేల నాన్ టీచింగ్ పోస్టులకు రిక్రూట్ మెంట్ మంజూరీ ఇచ్చామని హరీష్ అన్నారు. అంతేకాకుండా ఇంటర్ కాలేజీల్లో 3096 మందిని, టెక్నికల్ ఎడ్యుకేషన్ లో 520 మందిని, డిగ్రీ కాలేజీల్లో 280 కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కార్ దే అన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ 3232 పోస్టులను, యూనివర్సిటీల్లో 1061 పోస్టులను మంజూరు చేశామని, ఇవన్నీ దాచేస్తే దాగని సత్యాలన్నారు. 25వేల మెగా డీఎస్సీ అని ఊదరగొట్టి, మేమిచ్చిన 5089 డీఎస్సీ పోస్టులకు అదనంగా 6 వేలు కలిపి నోటిఫికేషన్ ఇచ్చి మెగా డీఎస్సీని దగా డీఎస్సీ మార్చిన గొప్ప వ్యక్తి రేవంత్ అన్నారు. కేసీఆర్ హయంలో లక్షా 60వేలకు పైగా ఉద్యోగాలిచ్చామన్నారు. కేసీఆర్ మొదలు పెట్టిన 30 వేల ఉద్యోగనియామకాల ప్రక్రియ ను చివరి దశలో పూర్తి చేస్తే నువ్వు ఉద్యోగాలు ఇచ్చినట్టా అన్నారు.

**బిల్లా రంగాల గురించి చెబుతావా ?**

విద్యార్థులకు బిల్లా రంగాల గురించి బోధించమని టీచర్లకు చెబుతున్నావా..? అని హరీష్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ని తీవ్రవాది అని ఓ కేంద్రమంత్రి అంటే దిష్టి బొమ్మలు కాల్చారు కదా నువ్వు సీఎం స్థానంలో ఉండి బిల్లా రంగాలతో పోల్చవచ్చా అన్నారు. అంటే నీ దిష్టి బొమ్మలు ఎన్ని కాల్చాలి.. అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కి ఒక నీతి మాకో నీతా అన్నారు. కాంగ్రెస్ లో ఓడిపోయిన వారికి పదవులు ఇవ్వలేదా ? ఇదేమైనా కొత్తనా..? అన్నారు. ఇప్పుడు సాక్షాత్తూ రేవంత్ కూడా ఓడిపోయిన వారికి పదవులు ఇవ్వలేదా అని నిలదీశారు.

**నోరా.. మోరా..?**

సీఎం రేవంత్ ది నోరో., మోరో అర్థం కావడం లేదని హరీశ్ అన్నారు. కవిత ఎమ్మెల్సీ గా ఓట్ల తోనే గెల్చిందనే విషయం మర్చిపోయినట్టున్నారన్నారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగాల నియామక ప్రక్రియను కోర్టులకెళ్లి అడ్డుకున్నది కాంగ్రెస్ నేతలు కాదా చెప్పాలన్నారు. నిరుద్యోగులను స్వార్థం కోసం రెచ్చగొట్టి మోసం చేస్తున్న దగా కోరు సీఎం అని, జాబ్ కేలెండర్ ను జాబ్ లెస్ కేలండర్ గా మార్చింది కూడా రేవంత్ రెడ్డే అన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని విద్యార్థులను, నిరుద్యోగులకు ఆశలు పెట్టి, పది నెలలు అయినా నియామకాల ఊసే లేకుండా మభ్యపెడుతున్నారన్నారు.

**మాటలే పడగొడ్తాయి..**

సీఎం ను పడగొడతాం అని ఎవరో అన్నట్టు సానుభూతి రాజకీయాలు మొదలు పెడుతున్నాడని, ఆయన మాటలే ఆయనను పడగొడ్తాయన్నారు. ఆయన గ్యారంటీలే ఘోరీ కడతాయని ఎద్దేవా చేశారు. హర్యానా ఓటర్లు కాంగ్రెస్ గ్యారెంటీలకు గోరి తవ్వారని, తెలంగాణలో ఇపుడు బొందతవ్వడం మొదలైందన్నారు. గంట కూడా రెస్ట్ లేకుండా పని చేస్తున్నా అని చెబుతున్న సిపాయి, ప్రజలకు ఇన్ని కష్టాలు ఎందుకొస్తున్నాయో చెప్పాలన్నారు.

## పునరావాసం కల్పించాకే ఖాళీ చేయిస్తాం..

- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకంతో ఉన్నారు.
- మూసీ బాధిత పిల్లల విద్యకు ప్రభుత్వం చర్యలు
- పదేండ్లలో కేసీఆర్‌ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్




**జనపదం, హైదరాబాద్ సిటీ :** మూసీ నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తర్వాతే ఖాళీ చేయిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వడంతో పాటు వారి పిల్లలకు విద్య తదితర వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డి తుది నిర్ణయం తీసుకుంటారని, బీసీ సంక్షేమశాఖ, బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన శాఖ ద్వారా కులగణన కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వం త్వరలోనే పడిపోతోందని అంటున్న వాళ్లు తమ పద్ధతి మార్చుకోవాలని కోరారు, తెలంగాణ వచ్చిందే నీళ్లు నిధులు నియామకాల కోసమని, . ఎవరెన్ని సెటైర్లు వేసినా ఉద్యోగ నియామకాలు చేపడుతామని అన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు మంత్రులు గాంధీభవన్‌కు రావాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు గాంధీభవన్‌కు వచ్చి ప్రజలనుంచి వినతులు స్వీకరించామన్నారు. మా పది నెలల పాలనపై చర్చకు సిద్ధమా అంటున్న మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీరు పదేళ్లల్లో ఏం పాలించారో తెలపాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందని ప్రశ్నించా రు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉద్యోగాలు భర్తీ చేస్తుందని విద్యార్థి, నిరుద్యోగులు సంతృప్తిగా ఉన్నారని వెల్లడించారు. గత ప్రభుత్వం 150 మందికి విదేశీ విద్యానిధి ఇవ్వగా కాంగ్రెస్ 500 మందికి విదేశీ విద్యానిధి ఇస్తోందని పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారు.. ప్రజలు ఏం చేశారో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఎవరెన్ని విమర్శలు చేసిన ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారని పొన్నం అన్నారు. కాగా, గాంధీ భవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమం సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు.

## విద్యా గుమ్మంగా ఖమ్మం..

- 22 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం
- 11న స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- అక్రమ ల్యాండ్ మైనింగ్, గంజాయిని అరికట్టాలి
- కలెక్టర్, సీపీల సమావేశంలో మంత్రి తుమ్మల



**జనపదం, ఖమ్మం :** చదువుల కేంద్రంగా ఖమ్మం జిల్లాను తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్తులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ శంకుస్థాపనకు సర్వసిద్ధం చేయాలని ఆదేశించారు. 22 ఎకరాల్లో స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. తక్షణమే భూమిని గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 11న స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అయితే ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటుకు అవసరమైన 22 భూమిని రఘునాథపాలెం మండలం జింకల తండా వద్ద గుర్తించినట్లు కలెక్టర్ ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా తుమ్మల వివిధ అంశాలపై మాట్లాడుతూ నియోజకవర్గంలోని 50 మసీద్‌లకు రూ.50 లక్షల నిధులు తక్షణమే కేటాయించాలన్నారు. అక్షయ పాత్రకు త్వరితగతిన భూమిని గుర్తించి, అక్షయ పాత్ర బాధ్యులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచిం చారు. డంపింగ్ యార్డ్ సమస్యను అధిగమించేలా యుద్ధ ప్రాతి పదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. అధికారులంతా హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని, కింది స్థాయి సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి అధికారం యంత్రాంగం కృషి చేయాలన్నారు. జిల్లాలో మైనింగ్, గంజాయి అక్రమార్కులపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎస్పీ సునీల్ దత్తుకు సూచించారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

## వికలాంగుల శాఖలో భారీ అవినీతి

- త్వరలోనే ఏసీబీ, విజిలెన్స్ ఎంక్వైయిరీ వేస్తున్నాం
- ఓ మంత్రి, చైర్మన్, అధికారి కుమ్మక్కు
- రూ.కోట్లు స్వాహా?
- కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య




**జనపదం, హైదరాబాద్ :** గత ప్రభుత్వ హయాంలో వికలాంగుల శాఖలో భారీగా అవినీతి జరిగిందని కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రి, కార్పొరేషన్ చైర్మన్, ఓ అధికారిణి కుమ్మక్కై దాదాపు రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను వేర్వేరు ఖాతాల్లోకి మళ్లించి అక్రమాలకు తెర లేపారని విమర్శించారు. ఒక ఆర్థిక సంవత్సరానికి, మరో ఆర్థిక సంవత్సరానికి అకౌంట్‌లు ట్యాలీ కావడం లేదని, నిధులు దుర్వినియోగం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కొన్ని సార్లు మేనేజ్ మెంట్ కమిటీ పర్మిషన్ లేకుండా కూడా ఆఫీస్ అ కౌంట్ నుంచి డబ్బులు డ్రా చేశారన్నా రు. వికలాంగుల పరికరాల నిమిత్తం వచ్చిన నిధులను కూడా దోచుకున్నారని మండిపడ్డారు. బిల్డింగ్ మరమ్మతుల పేరిట కూడా నిధులు వాడారన్నారు. వికలాంగుల బడ్జెట్ నుంచి జీతాలకు డబ్బులు వాడారని, అప్పుడు జీతాలకు వచ్చిన నిధులు ఏమైనట్లు? అని ఆయన ప్రశ్నించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేస్తూ ఫించన్ తీసుకున్న చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిందన్నారు. త్వరలో వికలాంగుల శాఖ డైరెక్టర్‌గా ఓ ఐఏఎస్‌ను నియమిస్తామని, జరిగిన అవినీతిపై దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలని ముత్తినేని సవాల్ విసిరారు. వికలాంగుల శాఖలో జరిగిన అవినీతిపై త్వరలోనే ఏసీబీ, విజిలెన్స్ విచారణ వేస్తున్నామని, తప్పు చేసిన అధికారి, గత ప్రభుత్వ పెద్దలను ఎవరినీ విడిచిపెట్టేది లేదని ఆయన హెచ్చరించారు.

## సీఎంఆర్ఎఫ్‌కు ఎల్ అండ్ టీ రూ 5.5 కోట్ల విరాళం

**జనపదం, సెక్రటేరియట్ :** వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి ఎల్ అండ్ టీ సంస్థ రూ 5.5 కోట్ల విరాళం అందజేసింది. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలను కలిసిన ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రమణ్యం ఈ విరాళం చెక్కును అందజేశారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు, కాంట్రాక్టు సంస్థలు, రియల్ ఎస్టేట్ సంస్థలు కూడా ఈ దఫా పెద్ద ఎత్తున విరాళాలు అందిస్తున్నాయి. అలాగే కా ళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విచారణ ఎదుర్కొంటున్న మెగా, ఎల్ ఆండ్ టీ సంస్థలు కూడా తమ వంతుగా వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి భారీ విరాళాలు అందించడం విశేషం.



# బీజేపీలో కొత్త జోష్..

**రెండు రాష్ట్రాల రిజల్ట్స్ తో ఊపు..**
**ఓటింగ్ పెరగడంపై కమలం ఖుషీ..**
**ఒక్క ఫలితం.. లక్షల అనుమానాలు...**
**జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్..**
**హర్యానా, జమ్మూ ఫలితాలతో తెలిసి పోయిన ఓటరు నాడీ..**

**జనపదం, బ్యూరో :** రెండు రాష్ట్రాల ఫలితాలు., రెండు జాతీయ పార్టీలు. అంచనాలు., లెక్కలు. కాంగ్రెస్ అయితే నేలవిడిచిసామే చేసినంత పని. బీజేపీ పని ఖతం., కేంద్రంలోని సర్కార్ పై జనం తీవ్ర అసహనంతో ఏకపక్షంగా చేతివైపే నొక్కుతారని కలల సాగరంలో తేలి పోయింది కూడా. కానీ అనుకున్నవన్నీ జరిగితే కిక్కే ముంటది. సరిగ్గా అదే జరిగింది ఈనెల 8వ తేదీ ఫలితాల్లో. ఎలక్షన్ కమిషన్ ప్రకటించిన ఫలితాలతో అంతా తారుమారు. హస్తానికి శృంగభంగం., కమలానికి కొత్త వికాసం. హర్యానాలో బీజేపీ ముచ్చటగా మూడో సారి పీఠం దక్కించుకోగా, జమ్మూకశ్మీర్ ఓటింగ్ శాతం పెంచుకుని తానేంటో, వాడి ఏ స్థాయిదో అని సవాల్ విసిరింది. లెక్కింపు మొదలైన మొదట్లో, రిజల్ట్స్ ఒక్కొక్కటిగా ప్రకటన వేళ సంబురాల్లో ఉన్న చేతి పార్టీ, ఆఖరి వేళ ఆగమైంది. ప్లేట్ ఫిరాయిస్తూ తొండికి దిగి ఈవీఎంలపై దుమ్మెత్తిపోసింది.

**బీజేపీలో కొత్త జోష్..**
ఇప్పటికే పలు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో ప్లాన్ ప్రకారం చొచ్చుకెళ్తున్న బీజేపీకి ఈ ఫలితాలతో మరింత బలం చేకూరింది. స్థానిక నాయకులు, కార్యకర్తలు కొత్త జోష్ తో పార్టీ బలోపేతానికి మరింత శ్రమించాలనే కార్యదీక్ష దిశగా వెళ్లడానికి ఫలితాలు ప్రేరణగా మారాయి. తెలంగాణలో రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీకి పునాదులు గట్టిగా వేయాలని చూస్తున్న నాయకులకు ఇదో టానిక్ గా మారింది. దేశమంతా మోదీ వైపే చూస్తోందని, అందుకు నిదర్శనం ఆ ఫలితాలే అని ఇప్పటికే నాయకులు ప్రచారం కూడా మొదలు పెట్టారు.



**ఒక్క ఫలితం.. లక్షల అనుమానాలు...**
హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఫలితాలు బీజేపీకి కొత్త బలం ఇవ్వగా, కాంగ్రెస్ చావు తప్పికన్నులొట్టపడినట్టే అని సరిపెట్టుకుంది. కానీ, ఫలితాలు వెలువడడానికి ముందు సంబురాల్లో మునిగిన కాంగ్రెస్ ఒక్కొక్కటిగా ప్రకటన వస్తున్న కొద్దీ టాపిక్ మళ్లింపునకు పూనుకున్నది. బీజేపీ ఈవీఎంలను ట్యాపరింగ్ చేసే ఫలితాలను తారుమారు చేసిందనే పాత రాగాన్నే ఎత్తుకుని నవ్వులపాలైంది. నీకు అనుకూలమైతే ఒకటి, ప్రతికూలమైతే మరోటా.. అని జనమంతా ఈసడించుకునేలా చేసుకుంది. దేశమంతా రాహుల్ ప్రభ పెరుగుతోందని, మోదీకి ఇక నూకలు చెల్లినట్టే అని ప్రచారం మొదలు పెట్టిన కాంగ్రెస్ కు మింగుడుపడని విషయమిది. కాంగ్రెస్ ను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఫలితాలు చెబుతున్నాయి. కర్ణాటక, తెలంగాణలో మాదిరిగా గ్యారంటీలతో గట్టెక్కి గద్దెనెక్కుదామని భావించిన పార్టీ పెద్దలకు ఊహించని షాక్ తగిలింది. నిజంగా కాంగ్రెస్ కు బలం పెరిగితే ఏక పక్షంగా ఫలితాలు కనబడాల్సి ఉండాల్సింది. అలాకాకుండా కూటమిగా జట్టుకడితే తప్ప సాగలేని స్థితిలో ఉన్న ఆ పార్టీ పరిస్థితిని చూసి దేశమంతా ఎటుందో ఇట్టే తెలిసిపోతున్నది. కాగా, ఆ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో ఓటరు నాడీ తెలిసి పోయిందని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. జనమంతా మోదీ వెంటే ఉన్నారని, తప్పుడు ప్రచారంతో ఏదో సాధిద్దామని ఊహల్లో విహరిస్తున్న వారికి ఈ ఫలితాలు తగిన గుణపాఠమంటున్నారు. ఏదిఏమైనా దేశమంతా జాతీయ వాదంతో సాగుతున్న బీజేపీ వైపే ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర నేతలు గర్వంగా ప్రకటిస్తున్నారు.



# నేడు సద్దుల బతుకమ్మ సంబురాలు

**ట్యాంక్‌బండ్‌పై విస్తృత ఏర్పాట్లు..**
**రాజ్‌భవన్‌లో అంబరాన్నంటిన వేడుకలు..**
**గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న మహిళా మంత్రులు, సీఎస్**
**ఆడపడుచులకు సీతక్క, సురేఖ పండుగ శుభాకాంక్షలు..**

**జనపదం, కల్చరల్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, సాంస్కృతిక వారసత్వం చాటే విధంగా ఈ నెల 10 గురువారం ట్యాంక్‌బండ్ వేదికగా సద్దుల బతుకమ్మ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. దాదాపు పదివేల మంది మహిళలు పాల్గొని సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాదిమంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌పైకి చేరుకుంటారు. అద్భుతంగా నిర్వహించే సద్దుల బతుకమ్మ సంబురాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మహిళా ఉన్నతాధికారులు, పలు శాఖల మహిళా అధికారులు, జిహెచ్ఎంసి మహిళా తదితరులు పాల్గొంటారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ట్రాఫిక్, ఇతర భద్రత ఏర్పాట్లను చేపట్టింది. ట్యాంక్ బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు జరుగుతుంది.



**రాజ్‌భవన్‌లో మిన్నంటిన వేడుకలు..**
రాజ్‌భవన్‌లో బతుకమ్మ పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. బుధవారం సాయంత్రం రాజ్‌భవన్ ఆవరణలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆయన భార్య సుధా దేవ్ వర్మతో కలిసి మహిళా మంత్రులు సురేఖ, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మహిళా అభివృద్ధి సహకార కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, రాజ్ భవన్ సిబ్బంది, ఇతర మహిళలు పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సుధా దేవ్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర మహిళందరికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, అస్తిత్వానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. బతుకమ్మ సంబురాలతో రాజ్‌భవన్ ఆవరణలో ఆటపాటతో అలరించారు. అత్యంత ఆనందోత్సాహాల మధ్య ఈ కార్యక్రమం కొనసాగింది.



**మహిళలకు సురేఖ, సీతక్క శుభాకాంక్షలు..**
బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మంత్రులు సురేఖ, సీతక్క తెలంగాణ ఆడపడుచులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రంగు రంగుల పూల రూపంలోని ప్రకృతి పట్ల ఆరాధనను, స్త్రీ శక్తిని కొలిచే పండుగగా బతుకమ్మ పండుగకు తెలంగాణ సంస్కృతిలో విశిష్ట స్థానం ఉందని వారు ఈ సందర్భంగా అన్నారు. బుధవారం రాజ్ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొని మహిళలతో కలిసి ఆడిపాడారు. భూమాతతో, జల సంపదతో మానవ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఒక సంబరంగా వేడుకలను జరుపుకోవడమే బతుకమ్మ పండుగ పరమార్థమని మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.









# మింగడానికే మూసీ తొంపు..

- **సుందరీకరణ పేరుతో లక్ష కోట్లు స్వాహా..**
- **పనులతో రాహుల్, ఆయన బావకు దోచి పెట్టొచ్చు**
- **గల్లా పట్టి అడిగే వరకు కాంగ్రెస్ మోసం సాగుతూనే ఉంటది**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **మరోసారి రేవంత్ సర్కార్ పై నిప్పులు**

**జనపదం, హైదరాబాద్ బ్యూరో :** లక్ష కోట్ల రూపాయలను మింగడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ సుందరీకరణ ప్రాజెక్టును చేపడతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టును బూచిగా చూపించి రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలను దోచిపెట్టాలని రేవంత్ సర్కార్ యత్నిస్తోందని ధ్వజమెత్తారు. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటదన్నారు. ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వం పనితీరు ఎలా ఉందంటే వరంగల్ లో ఓ ఎమ్మార్వో ను బతుకమ్మ ఘాట్ చూసేందుకు వెళితే ఇళ్లు కూలగొట్టేందుకు వచ్చారనుకొని వాళ్లను తరమికొట్టారన్నారు. అలా ఉంది రాష్ట్రంలో పరిస్థితి అని ఎద్దేవా చేశారు.

యూపీ లో అక్కడ సీఎం బుల్డోజర్ రాజ్ ను నడిపిస్తున్నాడని మనం గతంలో అనుకున్నామని, కానీ మన తెలంగాణలో కూడా ఇప్పుడు అలాంటి బుల్డోజర్ సంస్కృతిని తీసుకొచ్చారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ చేస్తున్న ఆఘాయిత్యాలను చూసి ప్రతి ఒక్కరూ కేసీఆర్ ప్రభుత్వాన్ని తలచుకుంటున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ పది నెలల వాళ్ల పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తి తో ఉన్నాయన్నారు. బుధవారం తెలంగాణ భవన్ లో కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎంగా కేసీఆర్ ఉండి ఉంటే ఇప్పటికే రైతుల ఖాతాల్లోకి పైసలు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వచ్చేవన్నారు. ఈ సారి పండుగ పండుగ మాదిరిగా లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో పండుగ జరుపుకునే పరిస్థితి లేకుండా భయానక వాతావారణం సృష్టించారని విమర్శించారు. గత డిసెంబర్ 9న సోనియా గాంధీ బర్త్ డే రోజునే 2 లక్షలు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ స్వయంగా హామీ ఇచ్చారన్నారు.

**గ్యారంటీపై హామీ ఏమాయె..**
కేసీఆర్ జాబ్ పొగొట్టండి మీకు ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ అశోక్ నగర్ కు వచ్చి గ్యారంటీ అని హామీ ఇచ్చాడన్నాడు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి కి తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదని మండిపడ్డారు. అలాగే మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నాడు.... దీని కోటి 60 లక్షల మంది మహిళలు వేచి చూస్తున్నారన్నారు. వృద్ధులకు రూ. 4 వేలు,ఇంట్లో ఇద్దరికీ పింఛన్ అని ఏ ఒక్కరికి ఇవ్వడం లేదన్నారు. కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తా అన్నాడని, కానీ ఇనుము కూడా ఇవ్వడన్నారు. ఇచ్చిన హామీలకు పైసలు లేవుకానీ మూసీ కోసం మాత్రం రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట అని సెటైర్లు వేశారు.

**కమీషన్ ఇవ్వరు కదా..?**
**సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమీషన్ లు ఇవ్వరు కదా? అందుకే అదే మూసీ ప్రాజెక్ట్ మీద రేవంత్ పడ్డాడన్నారు. పేదలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు.. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ లో అక్రమంగా భూములు గుంజుకోవద్దంటూ బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డి ధర్నా చేస్తే అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అక్కడ రైతుల మీద లాఠీ ఛార్జి చేశారన్నారు. ముఖ్యమంత్రి కొడంగల్ నియోజకవర్గంలోనే ప్రజలను ఒప్పించకపోతే రాష్ట్రాన్ని ఎట్ల నడిపిస్తావు? అని ప్రశ్నించారు. పోలీసులను పెట్టుకొని ఇలాంటి అరాచకాలు ఎన్నో రోజులు నడపలేరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.**




# నమునాలన్నీ అతడివే..

- **నిందితుడివిగా తేల్చిన పరిశోధనలు..**
- **కోల్కతా డాక్టర్ కేసులో కీలక సాక్ష్యాలు...**
- **సీబీఐ ఛార్జీషీట్లో ముఖ్యమైన పాయింట్లు..**
- **డీఎన్ఏతో సహా 11 రుజువులు..**

**జనపదం, న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీకర్ జూనియర్ డాక్టర్ హత్యాచార కేసులో దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సీబీఐ కీలక సాక్ష్యాలను పొందుపర్చింది. డీఎన్ఏ, రక్తపు నమూనాలు సహా 11 రుజువులను అందులో ప్రస్తావించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సివిక్ వలంటీర్ సంజయ్‌రాయ్‌కు సంబంధించిన డీఎన్ఏ మృతిచెందిన వైద్యురాలి శరీరంపై లభ్యమైనట్లు అభియోగపత్రంలో సీబీఐ పేర్కొంది. ఘటనాస్థలంలో లభ్యమైన వెంట్రుకలు, బ్లూటూత్ ఇయర్‌ఫోన్ నిందితుడివేనని తెలిపింది. మృతురాలి రక్త నమూనాలు సంజయ్‌రాయ్ దుస్తులు, చెప్పులపై లభ్యమైనట్లు రుజువులను అభియోగపత్రంలో పేర్కొంది.

**ఆ నమునాలు నిందితుడివే..**
ఆర్జీ కర్ ఆస్పత్రిలో ఆగస్టు 9వ తేదీన ఈ హత్యాచార జరగగా, నిందితుడు సంజయ్‌రాయ్‌ను ఆగస్టు 10వ తేదీన కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. ఆగస్టు 8, 9 తేదీల్లో సంజయ్‌రాయ్ ఆస్పత్రిలోనే ఉన్నట్లు సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా సాక్ష్యాలుగా సీబీఐ సమర్పించింది. మృతురాలి రక్త నమూనాలు నిందితుడు సంజయ్‌రాయ్ జీన్స్, చెప్పులపై లభ్యమైనట్లు తెలిపింది. నిందితుడి దుస్తులు, ఫుట్‌వేర్‌ను ఆగస్టు 12వ తేదీన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలిలో లభ్యమైన వెంట్రుకలు నిందితుడు సంజయ్‌రాయ్‌తో సరిపోలినట్లు సీబీఐ పేర్కొంది. అంతేకాకుండా హత్యాచార ఘటనలో బాధితురాలు ప్రతిఘటించగా నిందితుడు సంజయ్‌రాయ్‌కు కొన్ని గాయాలయ్యాయి. వాటిని కూడా రుజువులుగా ఛార్జిషీట్‌లో తెలిపింది.

**బ్లూటూత్ ఇయర్ఫోన్తో నిందితుడు**
ఇక ఘటన జరిగిన ప్రదేశంలో లభ్యమైన బ్లూటూత్ ఇయర్‌ఫోన్ నిందితుడు మొబైల్ ఫోన్‌తో అనుసంధానం అవుతున్నట్లు సీబీఐ తెలిపింది. ఈ సాక్ష్యాలను సంబంధించి సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ పరిశోధనశాల రిపోర్ట్స్‌ను అభియోగపత్రంలో పేర్కొంది. ఆగస్టు 8, 9వ తేదీల్లో సంజయ్‌రాయ్ ఆస్పత్రిలో తిరుగుతూ ఉన్నప్పుడు బ్లూటూత్ ఇయర్‌ఫోన్ నెక్‌బ్యాండ్‌తో అతను కనిపించినట్లు చెప్పింది. అయితే, హత్యాచార ఘటన జరిగిన తర్వాత లిఫ్ట్ వద్దకు సంజయ్‌రాయ్ వెళ్లినప్పుడు అతని వద్ద బ్లూటూత్ ఇయర్‌ఫోన్ మిస్సైనట్లు పేర్కొంది.



గొంతు నులమడం, ఉక్కిరిబిక్కిరి చేయడమే వైద్యురాలు మృతికి కారణమని సీబీఐ ఛార్జీషీట్లో తెలిపింది. వైద్యురాలి మృతదేహానికి శవపరీక్ష నిర్వహించే సమయంలో ఆమె శరీరమంతా రిగర్ మోర్టిస్ ఉందని, పోస్ట్‌మార్టం జరగడానికి 12 నుంచి 18 గంటల ముందు ఆమె మరణించినట్లు అది సూచిస్తుందని వెల్లడించింది. మృతిరాలిపై బలవంతపు లైంగిక చర్య జరిగినట్లు లభ్యమైన ఆధారాలను కూడా అభియోగపత్రంలో పొందుపర్చింది. వైద్యురాలి శరీరంపై లభ్యమైన లాలాజలం సంజయ్‌రాయ్‌దే అని డీఎన్ఏ నివేదికలో తేలినట్లు తెలిపింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)కింద సంజయ్‌రాయ్‌పై వేర్వేరు సెక్షన్ల కింద కేసు నమోదైంది.

# సామాజిక రుగ్మతలపై ఉద్యమం..

- **స్వేరోస్ నేషనల్ కన్వెన్షన్ సక్సెస్ చేయాలి**
- **డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**జనపదం, సిద్ధిపేట :** స్వేరోస్ నెట్వ ర్క్ ప్రారంభించినప్పటి నుంచి అ నేక సామాజిక రుగ్మతలపై ఉద్య మాలు చేస్తూ విజయాలు సాధించిందని వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు బుధ వార ం సిద్దిపేట జిల్లా కేంద్రంలో స్వేరోస్ నేషనల్ కన్వెన్షన్ వాల్ పోస్టర్ ను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. స్వేరోస్ నెట్వర్క్ చేసిన ఉద్యమంతో బడిమానిన పిల్లల శాతం తగ్గిందని, దన్నారు. మద్యం, సిగరెట్ గుట్కా వరకట్నం వంటి సామాజిక బలహీనతలను నిర్మూలనకు నిత్యం పోరాటం చేశామన్నారు. కులాలకు మ తాలకు అతీతంగా జ్ఞాన సమాజమే లక్ష్యంగా పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ స్వేరోస్ తెలిపారు. దేశంతో పాటు ఇతర దేశాలలో కూడా స్వేరోస్ నెట్వర్క్ ఏర్పడి అనేక అంశాలపై చర్చించే విధంగా ఈ సంస్థ కృషి చేస్తుందన్నారు భవిష్యత్తులో వివిధ ఖండాలలో సైతం స్వేరోస్ నెట్వర్క్ బలంగా పనిచేస్తుందని నమ్ముతున్నట్లు వెల్లడించారు. చెడు వ్యసనాలు లేని వారే స్వేరోస్ ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు ఈ నెల 27 నాడు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో స్వే రోస్ నేషనల్ కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, స్వేరోస్ అభిమాను లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమస్త రాష్ట్ర కన్వీనర్ దుర్గయ్య, కో కన్వీనర్ వీరన్న, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ప్రతినిధులు స్వాములు, బొర్రా సురేష్ కు మార్, మెట్ల శంకర్ జిల్లా అధ్యక్షులు ఉప్పలేటి బాబు ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణ ప్రతినిధులు ఎడ్ల ప్రవీణ్ కుమార్ తిరుపతి, మోహన్ విజయ్ సాయిలు స్వామి పాల్గొన్నారు.



# ఆ తర్వాతే కొత్త ఉద్యోగాలు..

- **ముందు ఎస్సీ వర్గీకరణపై తేలాల్సిందే..**
- **2011 జనాభా లెక్కలే ప్రామాణికం**
- **ఏకసభ్య న్యాయ కమిషన్ నివేదిక వచ్చాకే నూతన నోటిఫికేషన్లు**
- **కమిషన్ రిపోర్ట్ సమర్పణకు 60 రోజులు గడువు**
- **ఈ రెండు నెలల్లో బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే పూర్తి చేయాలి**
- **సీఎం రేవంత్ రెడ్డి**
- **సచివాలయంలో ఉపసంఘంతో సమీక్ష..**

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో కొత్త నోటిఫికేషన్లకు మరికొంత సమయం తీసుకోనున్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన నోటిఫికేషన్లను మినహాయించి ఎస్సీ వర్గీకరణపై తేల్చిన తర్వాతే కొత్త ఉద్యోగాల భర్తీ మొదలుకానున్నది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు ఏకసభ్య న్యాయ కమిషన్ నియామకం వెంటనే చేపట్టడంతో పాటు 60 రోజుల్లోనే కమిషన్ నివేదిక సమర్పించేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏకసభ్య న్యాయ కమిషన్ నివేదిక సమర్పించిన అనంతరం దానికి అనుగుణంగా రాష్ట్రంలో నూతన నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వేపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణపై తమకు అందిన వినతులు, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో వర్గీకరణ అమలవుతున్న తీరు, హర్యానాలో తీసుకుంటున్న చర్యలను ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన మంత్రివర్గ ఉప సంఘంలోని సభ్యులైన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ సమావేశంలో వివరించారు.

**హైకోర్టు మాజీ న్యాయమూర్తితో..**
ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవకుండా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. ఆ కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశించారు. ఎస్సీ జనాభా లెక్కలకు సంబంధించి 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఏక సభ్య కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌ను అందజేశారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలు, కులాల రీగ్రూపింగ్‌కు సంబంధించి ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో విశ్లేషించారు. వాటన్నింటిని ఏక సభ్య కమిషన్‌కు అందజేయాలని నిర్ణయించారు. ఏక సభ్య న్యాయ కమిషన్ క్షేత్ర స్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఉమ్మడి పది జిల్లాల్లో ఒక్కో రోజు పర్యటించేందుకు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**తక్షణమే రంగంలోకి దిగండి..**
రాష్ట్రంలో బీసీ సామాజిక, ఆర్థిక, కుల సర్వే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వేపై బిహార్, కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలు అనుసరించిన విధానాలను అధికారులు వివరించారు. బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వే చేపట్టేందుకు అవసరమైన యంత్రాంగం తమ వద్ద లేనందున, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఓ నిర్ణయం తీసుకోవాలని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బీసీ కమిషన్ ఛైర్మన్ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రణాళిక విభాగాన్ని అందుకు కేటాయిస్తున్నామని సీఎం తెలిపారు. బీసీ కమిషన్‌కు.. రాష్ట్ర ప్రణాళిక విభాగానికి సమన్వయకర్తగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని సీఎం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. 60 రోజుల్లోనే సామాజిక, ఆర్థిక సర్వే పూర్తి చేయాలని డిసెంబరు 9 లోపే నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సర్వే పూర్తయితే వెంటనే స్థానిక సంస్థలు ఎన్నికలకు వెళ్లొచ్చని సీఎం అన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహా దారు వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి, సీఎంఓ కార్యదర్శులు మాణిక్ రాజ్, షానవాజ్ ఖాసీం, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రా భవిష్యత్ తరాలకు భరోసా

### చెరువే ఊరికి ఆదెరువు
### రియాల్ ఎస్టేట్ కు హైడ్రా ఎఫెక్ట్ తాత్కాలికమే... భవిష్యత్ అంతా బంగారమే

**హైడ్రా అనే మాట నేడు ప్రతి ఒక్కరి నోట వినిపిస్తున్న మాట. పాలక పక్షం నుంచి ప్రతిపక్షం వరకు ,సంపన్నుల నుంచి సామాన్యుల వరకు, ఎన్నారైల నుంచి సాఫ్ట్వేర్ ఇంజనీర్ల వరకు ఎవరి నోట విన్న హైడ్రా... హైడ్రా ...హైడ్రా అంటూ చర్చిస్తూనే ఉన్నారు. అసలు హైడ్రా అంటే ఏమిటి? దీని విధి విధానాలు ఏమిటి? అసలు ఎందుకు ఈ హైడ్రా! ఎవరికోసం ఈ హైడ్రా!! ఏమి చేయబోతుంది ఈ హైడ్రా !అనే సందేహాలు, ప్రశ్నలు అందరిలోనూ తలెత్తుతూనే ఉన్నాయి. అందుకే హైడ్రా గురించి ,హైద రాబాద్ రియాలిటీ భవిష్యత్తు గురించి ఓ విశ్లేషణాత్మక వివరణ మీకోసం......**



### చెరువే ఆ ఊరికి ఆదెరువు

**చెరువులే ఊరికి ఆదివారం చెరువు ఊరికి తల్లి లాంటిదని గ్రామీణ ప్రాంతంలో పెద్దలు చెబుతున్న మాట గ్రామంలో చెరువు ఉండి నీళ్లతో కలక లలాడితే ఆ గ్రామంలో పంటలకు సాగునీరు అందించడంతోపాటు సబ్బండ జీవరాశులకు దాహత్తిని తీర్చే జీవనదిగా ఉండేది బట్టలు బట్టలు ఉతకడం నుంచి పిల్లలు ఈత నేర్చుకోవడం తోపాటు పశువులకు దాహార్తిని తీర్చే నిలయాలుగా చెరువులు నిలిచేవి. అలాంటి చెరువుల పరిరక్షణ రక్షణ మనందరి బాధ్యతగా నిలవాల్సిన ఆవశ్యకత అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది.**

**హైడ్రా విధులు.. విధానాలు..**

హైడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ సింపుల్ గా హైడ్రా అని పిలుస్తున్నాం. ఈ హైడ్రా గతంలోనే ఉన్నప్పటికీ నేడు విస్తృతంగా ప్రచారానికి వచ్చిన మాట . హైదరాబాదు పరిధిలోని అంటే జిహెచ్ఎంసి పరిధి అనగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల వైపు ఉన్న చెరువులను గుంటలను పరిరక్షించడం రక్షించడం దీని ప్రధాన బాధ్యత కబ్జాలకు గురికాకుండా చూడటం హైడ్రా విధి విధానం దీనితో పాటు వరదలు భూకంపాలు ప్రకృతి వైపరీత్యాలు విపత్తులు వచ్చిన పృుడు నగర ప్రజలకు అండగా ఉంటూ సేవలందించడం దీని విధి విధానాలు ముఖ్యమంత్రి చైర్మన్ గా ఉండి ఈ హైడ్రాకు ఒక కమిషనర్ ఉంటూ తన విధులను నిర్వర్తిస్తుంది. అయితే ఈ హైడ్రా ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ నేటి ప్రభుత్వము వెలుగులోకి తీసుకువచ్చి హైడ్రాకు క్యాబినెట్ ఆమోదం, గవర్నర్ రాజముద్ర తో మరిన్ని అధికారాలను కట్టబెట్టడంతో హైడ్రా విధులు మరింత విస్తృతం కానున్నాయి. ఈ హైడ్రా ఒక చట్టబద్ధ సంస్థగా ప్రభుత్వ ఆస్తులను, చెరువులను ,కుంటలను పరిరక్షించే వ్యవస్థగా చూడాల్సిన బాధ్యత పౌరులపై ఇక బలంగా ఉండబోతుంది.

**హైడ్రా తో హైరానా ? ఎందుకంత ఆందోళనా..?**

హైడ్రా అనగానే ఎందుకంత హైరానా పడుతున్నారు ?హైడ్రా అనగానే ఎందుకంత ఆందోళన చెందుతున్నారు? హైడ్రా తో పేద, సామాన్య ప్రజలకు ఏమిటీ సమస్య? హైడ్రా చర్యలతో ఎవరికీ నష్టం? ఎవరికి లాభం !! హైడ్రా ఎవరికోసం... సంపన్నుల కోసమా ! పేదవారి కోసమా!! ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు కోసమా? లేక బిల్డర్లను వెంచర్ ఓనర్లను భయపెట్టి తన 'దారి"కి తెచ్చుకోవడం కోసమా? అనేక అనేక ప్రశ్నలు ఈ నోటా ఆ నోట రావడమే కాక నేడు రాష్ట్రంలో విస్తృతంగా చర్చ సాగిస్తున్నాయి .నిజానికి హైడ్రా రాకతో కబ్జాదారుల గుండెల్లో గుబులు పుట్టుకుంటుంది. చెరువులను ,కుంటలను, ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా లే. అవుట్ చేసి విక్రయించి సామాన్యులను నట్టేట ముంచారు. దీని మూలంగా హైడ్రా రాకతో సామాన్యులు ఆందోళన చెందాల్సి వచ్చింది. కబ్జాదారులు దర్జాగా తమ ఖజానా నింపుకున్నారు. చెరువులలో, ఎఫ్టీఎల్ ప్రాంతంలో, బఫర్ జోన్ స్థలాలలో నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన ఎప్పటినుంచో ఉన్నప్పటికీ పట్టా భూముల సాకుతో యదేచ్చగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు .దేనితో నగరంలోని పురాతన కాలం నాటి 5000 చెరువులకు గాను అన్ని కనుమరుగైపోయి కేవలం 935 చెరువులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అందుకే వాటి రక్షణ కె" హైడ్రా" అవతరించింది.





**రియాల్టీ కి "హైడ్రా "ఎఫెక్ట్ తాత్కాలికమే...భవిష్యత్ అంతా "బంగారమే"**

హైడ్రా దూకుడుగా రావడంతో రియాల్టీ కి కొంత ఎఫెక్ట్ ఉన్నప్పటికీ అది తాత్కాలిక మే అవుతుంది .ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులు హైడ్రా నిబంధనలకు లోబడి ఉన్నాయా? లేవా? అనే సందేహంతో ఇన్వెస్టర్లు ఆలోచిస్తున్నారే తప్ప హైదరాబాద్ రియాల్టీ కి ఎలాంటి డోకా లేదు. హైడ్రా మూలంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మరింత కొత్త పుంతలు తొక్కి మరింత జెన్యూన్ గా, 100% అన్ని అనుమతుల తో ఇన్వెస్టర్లకు 'భద్రత 'కల్పిస్తూ భవిష్యత్తు తరాలకు "భరోసా"గా నిలవనున్నది .ఇక్కడ పెట్టే పెట్టుబడులకు ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా ఉండే అవకాశం ఉండబోతుంది. కబ్జాలేని, FTL కానీ, బఫర్ జోన్ బాధ లేకుండా ఉండే వెంచర్ల కోసం, ప్రాజెక్టుల కోసం కస్టమర్లు ఎదురు చూసి ఇన్వెస్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. గతంలో లాగా గుడ్డిగా కాకుండా ఒకటికి పది సార్లు లీగల్ ఒపీనియన్ తీసుకొని అన్ని అనుమతులు ఈ ప్రాజెక్టులకు ఉన్నాయా? లేవా? అని అన్వేషించి హైడ్రా నిబంధనల ప్రకారం ఈ వెంచర్ చేపట్టారా? లేదా అని చూసి ఆ తర్వాత ఇన్వెస్టర్లు ఇన్వెస్ట్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 'హైడ్రా' రాక తమ భవిష్యత్తు కోసమేనని, భవిష్యత్తు భవిష్యత్తు అంతా "బంగారమే "అంటూ చాలామంది ఇన్వెస్టర్లు ఉత్సాహంతో ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాబట్టి హైడ్రా నిబంధనలతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ లో ధరలు మరింత పెరుగుతాయే తప్ప తగ్గడానికి ఎలాంటి అవకాశం లేదు. కావున ఇన్వెస్టర్లు ఇప్పుడే తమ తమ పెట్టుబడులను పెట్టి లాభాలను పొందడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### హెచ్ఎండీఏ వెంచర్లకు 'హైడ్రా'తో ఇబ్బంది లేదు..

**హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం ఎఫ్టీఎల్, బఫర్ జోన్ వదిలిన వెంచర్లలో కొనుగోలు చేయడం మూలంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. 2013 హెచ్ఎండిఏ ఏర్పడిన తర్వాత ఎవరైతే లే ఔట్లు చేసి బిల్డింగులు నిర్మించారో వారికి హైడ్రా ఎఫెక్టు ఉందా అనే ప్రశ్న తలెత్తుతుంది. నిబంధనల ప్రకారం కుంటలకు చెరువులకు నాళాలకు బఫర్ జోన్లు వదిలి చేసిన వెంచర్లలో ఓపెన్ ప్లాట్స్ కొనుగోలు చేయడం మూలంగా ఎలాంటి ఇబ్బందులు కలగక పోవచ్చు. కానీ నిబంధనలు అధికమించి చేసిన వెంచర్లలో కొనుగోలు చేస్తే తప్పక**



**మూల్యం చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి అలాంటి ప్రాజెక్టులలో కొనుగోలు చేసిన వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే జరగబోయే నష్టం నుంచి కొంతైనా బయటపడే అవకాశం ఉంది.**

### చెరువు శిఖం, ఎఫ్టీఎల్, బఫర్ జోన్లు అంటే ఏమిటి..

**ఒక చెరువుకు కట్ట ఉంటుంది ఆ కట్ట సామర్థ్యాన్ని బట్టి వర్షపు నీరు నిలువ ఉండే విధంగా లోతట్టు ప్రాంతం అంచనా వేసి ఆ కట్టకు అలుగు ఏర్పాటు చేస్తారు. వర్షం పడి నప్పుడు చెరువు కట్టకు సమాంతరంగా నీళ్లు ఉన్న ప్రాంత మే చెరువు 'శిఖం'. ఈ శిఖం ప్రాంతం వర్షాలు పడుతున్న కొద్ది పెరిగే అవకాశం ఉంటుంది. దీనికోసం మరింత నీరు నిల్వ ఉండటం కోసం ఉండే ప్రాంతం ఎఫ్ టి ఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్ ),దీని తర్వాత కూడా ఇంకా వర్షాలు ఎక్కువగా పడితే నీళ్లు వచ్చి నిల్వ ఉండటానికి అవకాశం ఉన్న ప్రాంతాన్ని' బఫర్ జోన్' గా పిలవబడుతుంది. అయితే చెరువు శిఖం మాత్రం ఆ చెరువు విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వ భూమి గా ఉంటుంది. FTL, బఫర్ జోన్ ప్రాంతాలు పట్టా భూములు గా ఉంటాయి. ఈ భూములను ప్రభుత్వాలు భూమిలేని పేదలకు పట్టాలిచ్చి వ్యవసాయం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. కావున FTL, బఫర్ జోన్ల లో కేవలం వ్యవసాయ మాత్రమే చేసుకోవాలి తప్ప ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. హైదరాబాదు నగరం మహానగరం గా విస్తరిస్తున్న సమయంలో చెరువులు కుషించకపోయి బఫర్ జోన్ ప్రాంతాలను సైతం పట్టాలు ఉన్నాయనే కారణంతో ఆ హక్కుదారులు అమ్మడం, నిర్మాణదారులు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం మూలంగా వెంచర్లు రావడం అక్రమ నిర్మాణాలు ఏర్పడడం చకాచకా జరిగిపోయాయి. కానీ చిన్న చెరువులు ఐదు ఎకరాల లోపు విస్తీర్ణం ఉంటే ఎఫ్టిఎల్ ప్రాంతం నుంచి 9 మీటర్ల వరకు బఫర్ జోన్ గా వదిలివేయాలి, 5 ఎకరాల పైన విస్తీర్ణం ఉన్న చెరువులకు ఎఫ్టిఎల్ ప్రాంతాల నుంచి 30 మీటర్ల వరకు బౌఫర్ జోన్లుగా ప్రభుత్వం నిర్ధారించింది ఈ బఫెర్ జోన్ ప్రాంతంలో కానీ FTL ప్రాంతంలో గాని ఎలాంటి నిర్మాణాలు చేపట్ట కూడదని నిబంధనలు విధించింది .ఇప్పుడు ఈ నిబంధనలు తుంగలో తొక్కి ఎవరైతే అక్రమ నిర్మాణాలు చేపట్టారో వారి గుండెల్లో 'హైడ్రా' అనే రైలు పరిగెడుతుంది.**




## సంయుక్త సింగిల్ గా..

**మలయాళీ బ్యూటి సంయుక్త ఈసారి హీరోయిన్‌గా కాకుండా లేడీ ఓరియెంటెడ్ సినిమాలో కనిపించనుంది. ఈ భామ ఇప్పటికే వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకు పోతున్న విషయం తెలిసిందే. గతేడాది భీమ్లా నాయక్ సినిమాతో హిట్ అందుకున్న అందాల చిన్నది ప్రస్తుతం నిఖిల్‌తో స్వయంభు అనే పాన్ ఇండియా సినిమా చేస్తుంది. అయితే ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం పట్టాలమీద ఉండగానే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేసింది. సంయుక్త లీడ్ రోల్‌లో ఒక న్యూ ఏజ్ యాక్షన్ డ్రామా రాబోతుంది. హాస్య మూవీస్ బ్యానర్‌లో రానున్న ఈ చిత్రం బుధవారం పూజ కార్యక్రమాలు జరుపుకుంది. ఇక ఈ వేడుక ముఖ్య అతిథిగా వచ్చిన రానా దగ్గుబాటి క్లాప్ నివ్వగా.. నిర్మాతలు దిల్ రాజు, కోనా వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఇక ఈ సినిమాకు యోగేశ్ దర్శకత్వం వహించబోతున్నాడు.**



## బుసాన్‌లో కల్కి హవా...

**పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన లాస్ట్ మూవీ కల్కి 2898 AD బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో మనం చూశాం. దర్శకుడు నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన సై ఫై మూవీలో ప్రభాస్ పర్ఫార్మెన్స్ టెర్రిఫిక్‌గా ఉండటంతో ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఇక ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఏకంగా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ సినిమాకు ఇండియన్ ఫ్యాన్స్‌తో పాటు ఓవర్సీస్ ఆడియెన్స్ కూడా ఫిదా అయ్యారు. ఇక తాజాగా ఈ చిత్రాన్ని బుసాన్ ఫిలిం ఫెస్టివల్ 2024లో ప్రదర్శించారు. ఈ సినిమాకు అక్కడి ఆడియెన్స్ మంత్రముగ్ధులయ్యారు. ఈ సినిమాను చూసి వారు పూర్తిగా ఎంజాయ్ చేయడంతో, వారు సాలిడ్ రెస్పాన్స్ ఇచ్చారు.**



## ఓటీటీలోకి పైలం పిలగా..

**'పిల్ల పిలగాడు'** అనే వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న సాయితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'పైలం పిలగా'. ఈ సినిమాలో కథానాయి కగా పరేషాన్ ఫేం పావని కరణం నటించగా.. ఆనంద్ గుర్రం దర్శకత్వం వహించాడు. తెలంగాణ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో లవ్& కామెడీ జానర్‌లో వచ్చిన ఈ చిత్రం సెప్టెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుం ది. ఈటీవీ విన్‌లో దసరా కానుకగా ఈ సినిమా గురువారం నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.



## రాజేంద్ర ప్రసాద్ ను పరామర్శించిన ప్రభాస్

**సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్** ఇంట్లో విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. గుండెపోటుతో ఆయన కుమార్తె గాయత్రి గత శనివారం మృతి చెందింది. కూతురు పోయిన బాధలో ఉన్న నటకిరిటిని తాజాగా నటుడు రెబల్ స్టార్ ప్రభాస్ పరామర్శించాడు. అనంతరం రాజేంద్రప్రసాద్ కూతురు గాయత్రికి నివాళులు అర్పించాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.



## మిస్ యూ రతన్ జీ..

**అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ మృతి**
**టాటా సంపాదనలో 60శాతానికి పైగా సేవలకే..**

**జనపదం, బిజినెస్ :** ప్రముఖ వ్యాపారవేత్త, టాటా గ్రూప్ చైర్మన్ రతన్ టాటా (86) కన్నుమూశారు. వయోభారంతో కొన్ని రోజులుగా ముంబైలోని బ్రిజ్ ఖండి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రతన్ టాటా బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. సోమవారం (అక్టోబర్ 7న) పలు అనారోగ్య సమస్యల కారణంగా ఆస్పత్రిలో చేరిన రతన్ టాటా ఆరోగ్యం క్షీణిస్తూ వస్తుండటంతో ఆయనను ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి చికిత్స అందించారు. అయితే రతన్ టాటా పరిస్థితి పూర్తిగా విషమించటంతో చికిత్స పొందుతూనే ప్రాణాలు వదిలారు.

**1991లో..**

రతన్ టాటా 1991లో 'టాటా సన్స్' చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వందేళ్ల కిందట తన ముత్తాత స్థాపించిన గ్రూప్‌ను 2012 వరకు ఎంతో విజయవంతంగా నడిపారు. 1996లో టెలి కమ్యూనికేషన్స్ కంపెనీ అయిన టాటా టెలిసర్వీసెస్‌ను, 2004లో ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌ని ప్రారంభించి పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక అడుగులు వేశారు. టాటా గ్రూప్ సంస్థను ఉన్నత శిఖరాలకు



చేర్చడంలో రతన్ టాటా కీలక పాత్ర పోషించారు. రతన్ టాటా నాయకత్వంలో, టాటా గ్రూప్స్ సంస్థ 100 బిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ వ్యాపార సామ్రాజ్యంగా ఎదిగింది. తన వ్యాపారాలన్నింటినీ ఎంతో విజయవంతంగా నడిపిస్తూ దేశంలోని గొప్ప పారిశ్రామిక వేత్తల్లో ఒకరిగా రతన్ టాటా పేరు సంపాదించుకున్నారు. దిగ్గజ పారిశ్రామికవేత్తగానే కాకుండా రతన్ టాటా అంతకుమించి గొప్ప మానవతావాది కూడా. రతన్ టాటా సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్‌ను స్థాపించారు. రతన్ టాటా సంపాదించిన లాభాల్లో దాదాపు 60 నుంచి 65శాతం దాతృత్వ ప్రయోజనాల కోసం విరాళంగా అందించారు.

**86ఏళ్లు గౌరవ చైర్మన్ హోదాలో..**

86 ఏళ్లు ఉన్న రతన్ టాటా.. చివరి దశలో గౌరవ చైర్మన్ హోదాలో కొనసాగారు. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ.. టాటా సన్స్‌కు కూడా గతంలో చైర్మన్‌గా ఉన్నారు. టాటా గ్రూప్ ఛారిటబుల్ ట్రస్టులకు మాత్రం రతన్ టాటా నాయకత్వం వహించారు. ఇక.. బిజినెస్ టైకూన్‌గా పేరు తెచ్చుకున్న రతన్ టాటాను.. 2008లో దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ విభూషణ్‌తో అప్పటి కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. అంతకు ముందు 2000లోనే రతన్ టాటాను పద్మ భూషణ్ వరించింది.






Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com